తెలంగాణ

TELANGANA MUCHATLU

ముచ్చట్లు

తెలుగు దిన పత్రిక

ఎడిటర్ : బొల్లెపాక రాజేష్

వరంగల్ | శుక్రవారం - 13 - ఫిబ్రవరి 2026 | సంపుటి:3 | సంచిక:256 | పేజీలు:8 | వెల: రూ.5 | www.telanganamuchatlu.in




గ్రామ పంచాయతీలకు రూ.646.46 కోట్ల

# ఆర్థిక సంఘం నిధులు విడుదల

**తొలి విడతగా రూ.259.36 కోట్లు**

**తాజా విడతతో మొత్తం రూ.387 కోట్లు విడుదల**

**పెండింగ్ నిధులు త్వరితగతిన విడుదల చేయాలని విజ్ఞప్తి**

**హైదరాబాద్, ఫిబ్రవరి 12 (తెలంగాణ ముచ్చట్లు):**

తెలంగాణలోని గ్రామ పంచాయతీలకు కేంద్ర ఆర్థిక సంఘం నుంచి నిధులు విడుదలయ్యాయి. వారం రోజుల క్రితం తొలి విడతగా రూ.259.36 కోట్లు విడుదల కాగా, తాజాగా మరో విడతగా రూ.387 కోట్లు విడుదలయ్యాయి.

మిగతా 2లో..

## గాంధీ సరోవర్ శంకుస్థాపనకు

# రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌కు ఆహ్వానం

**మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టు వివరాలు తెలిపిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి**

**ఈసా–మూసీ సంగమంలో ప్రపంచ స్థాయి కేంద్రం నిర్మాణం**

**శాంతి, ఐక్యతకు ప్రతీకగా గాంధీ సరోవర్**



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 12 (తెలంగాణ ముచ్చట్లు):**

మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టులో భాగంగా ఈసా -మూసీ నదుల సంగమ స్థలిలో నిర్మించనున్న గాంధీ సరోవర్ ప్రాజెక్టు శంకుస్థాపన కార్యక్రమానికి రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌ను ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ఆహ్వానించారు. ఢిల్లీ పర్యటన సందర్భంగా సౌత్ బ్లాక్‌లోని కేంద్ర మంత్రి కార్యాలయంలో ముఖ్యమంత్రి మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు.

మిగతా 2లో..



# రాష్ట్రంలో 44 వేలకు పైగా

# జర్నలిస్టులకు అక్రిడిటేషన్ కార్డులు

**అక్రిడిటేషన్ ప్రక్రియ మరింత పారదర్శకంగా**

**అర్హులందరికీ న్యాయం**

**రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి**

**హైదరాబాద్,ఫిబ్రవరి12(తెలంగాణ ముచ్చట్లు):**

రాష్ట్రంలో అర్హత కలిగిన ప్రతి జర్నలిస్టుకూ అక్రిడిటేషన్ కార్డు అందేలా ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. జర్నలిస్టుల సంక్షేమం పట్ల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం పూర్తి నిబద్ధతతో పనిచేస్తోందని పేర్కొన్నారు.అక్రిడిటేషన్ కార్డుల జారీ విధానం, అక్రిడిటేషన్ కమిటీ ఏర్పాటు తదితర అంశాలపై గురువారం సచివాలయంలోని తన కార్యాలయంలో సమాచార పౌరసంబంధాల శాఖ కమిషనర్ సిహెచ్. ప్రియాంక, ముఖ్యమంత్రి సిపిఆర్‌వో జి. మల్సూర్‌లతో మంత్రి సుదీర్ఘంగా చర్చించారు.

మిగతా 2లో..

## ఓటు వేయలేదని డబ్బులు, కుక్కర్లు

# తిరిగి అడిగిన అభ్యర్థిపై ఆగ్రహం

**అశ్వారావుపేట మున్సిపాలిటీలో ఘటన**

**అవమానకరంగా మాట్లాడారంటూ ప్రజల ఆగ్రహం**

**"ఇవ్వమని ఎవరడిగారు?" అంటూ నిలదీత**

2లో



# కాళేశ్వరం మిగులు పనుల పర్యవేక్షణ

మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు ఆదేశాలు

మండల అధ్యక్షుడు కామిని శ్రీనివాస్ ఆధ్వర్యంలో పరిశీలన

రెండు రోజుల్లో సాగునీరు అందిస్తామని అధికారుల హామీ

2లో



## తెలంగాణ ఉద్యమకారుల

# ఆత్మగౌరవ సభలో నివాళులు

- ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహానికి పుష్పాంజలి
- అమరవీరులకు రెండు నిమిషాల మౌనం
- తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో కార్యక్రమం



**హైదరాబాద్, ఫిబ్రవరి 12 (తెలంగాణ ముచ్చట్లు):**

తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న తెలంగాణ ఉద్యమకారుల ఆత్మగౌరవ సభలో జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత పాల్గొన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహానికి పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. అనంతరం తెలంగాణ కోసం ప్రాణత్యాగం చేసిన అమరవీరులను స్మరించుకుంటూ రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు. తెలంగాణ సాధనలో ఉద్యమకారుల త్యాగాలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. తెలంగాణ ఆత్మగౌరవాన్ని కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని కల్వకుంట్ల కవిత పేర్కొన్నారు. ఉద్యమ స్ఫూర్తిని తరతరాలకు అందించే లక్ష్యంతో ఈ సభ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

# ఉగాదికి సనత్‌నగర్ టిమ్స్ ప్రారంభం

1000 పడకల సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి సిద్ధం

గుండె, అవయవ మార్పిడి కేంద్రాలుగా అభివృద్ధి

ఉగాది నాటికి ప్రజలకు అంకితం చేయాలన్న ప్రభుత్వ నిర్ణయం



**హైదరాబాద్, ఫిబ్రవరి 12 (తెలంగాణ ముచ్చట్లు):**

పేదలకు కార్పొరేట్ స్థాయి సూపర్ స్పెషాలిటీ వైద్యాన్ని పూర్తిగా ఉచితంగా అందించే లక్ష్యంతో నిర్మించిన సనత్‌నగర్ టిమ్స్ ఆసుపత్రి ప్రారంభానికి ముహూర్తం ఖరారైంది. ఉగాది పండుగ రోజున ఆసుపత్రిని ప్రజలకు అంకితం చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.

మిగతా 2లో..

## కార్పొరేషన్ ఎన్నికల్లో

# గులాబీ జెండానే ఎగురుతుంది: కేటీఆర్

- శేరిలింగంపల్లిలో యువ నాయకుడు విజయ్ కుమార్ రెడ్డి బీఆర్ఎస్‌లో చేరిక
- హైదరాబాద్‌లో పార్టీ బలంపై ధీమా .. తెలంగాణకు కేసీఆర్ నాయకత్వమే రక్షణ అని వ్యాఖ్య

**హైదరాబాద్, ఫిబ్రవరి 12 (తెలంగాణ ముచ్చట్లు):**

హైదరాబాద్ మహానగరంలో రాబోయే కార్పొరేషన్ ఎన్నికల్లో ఎన్ని కార్పొరేషన్లు చేసినా గెలిచేది గులాబీ జెండానేనని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు స్పష్టం చేశారు. శేరిలింగంపల్లి నియోజకవర్గానికి చెందిన యువ నాయకుడు విజయ్ కుమార్ రెడ్డి తన అనుచరులతో కలిసి తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్‌లో చేరగా, కేటీఆర్ గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.


మిగతా 2లో..



# సింగరేణి చైర్మన్‌గా డాక్టర్ జ్యోతి బుద్ధ ప్రకాష్ బాధ్యతల స్వీకారం

- హైదరాబాద్ సింగరేణి భవన్‌లో అధికారిక బాధ్యతలు.. 2002 బ్యాచ్ ఐఏఎస్ అధికారి
- పలు కీలక శాఖల్లో విస్తృత అనుభవం

2లో



తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : పొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

## గాంధీ సరోవర్ శంకుస్థాపనకు
# రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌కు ఆహ్వానం

(మొదటి పేజీ తరువాయి)

సుస్థిర పట్టణాభివృద్ధి లక్ష్యాలతో, పర్యావరణ హితంగా మూసీ నది పునరుజ్జీవన కార్యక్రమం చేపడుతున్నట్లు ముఖ్యమంత్రి వివరించారు. స్వచ్ఛమైన నీటితో నది ప్రవహించేలా సమగ్ర చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. 1948లో జాతిపిత మహాత్మా గాంధీ చితాభస్మాన్ని నిమజ్జనం చేసిన బాపూ ఘాట్ సమీపంలో గాంధీ సరోవర్ నిర్మించనున్నట్లు తెలియజేశారు. గాంధీజీ ఆశయాలైన శాంతి, ఐక్యత, సుస్థిర అభివృద్ధి, నిరాడంబర జీవనశైలిని ప్రతిబింబించేలా ఈ ప్రాజెక్టును రూపుదిద్దనున్నట్లు ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ప్రపంచ స్థాయి విద్యా, సాంస్కృతిక, ఆధ్యాత్మిక, పర్యావరణ కేంద్రంగా గాంధీ సరోవర్‌ను అభివృద్ధి చేస్తామని తెలిపారు. ఇందులో శాంతి చిహ్నం, జాతీయ మ్యూజియం, విజ్ఞాన కేంద్రం, చేనేత ప్రోత్సాహక కేంద్రం ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు. ఫిబ్రవరి నెలాఖరులో నిర్వహించనున్న శంకుస్థాపన, భూమిపూజ కార్యక్రమానికి హాజరుకావాలని రక్షణ మంత్రిని ముఖ్యమంత్రి కోరారు. ఈ భేటీలో ఎంపీలు ఎం అనిల్ కుమార్ యాదవ్, డాక్టర్ మల్లు రవి, సురేశ్ షెట్కార్, డాక్టర్ కడియం కావ్య, గడ్డం వంశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రంలో 44 వేలకు పైగా జర్నలిస్టులకు అక్రిడిటేషన్ కార్డులు

(మొదటి పేజీ తరువాయి)

ప్రక్రియ పారదర్శకంగా, వేగవంతంగా సాగేందుకు తీసుకోవాల్సిన చర్యలపై దిశా నిర్దేశం చేశారు.

అక్రిడిటేషన్ కార్డుల జారీకి సంబంధించి ప్రభుత్వం ముందుగా జి.ఓ. 252 జారీ చేసినట్లు మంత్రి తెలిపారు. అనంతరం జర్నలిస్టు సంఘాలతో సమావేశమై వారి సూచనలు, అభిప్రాయాలను సవివరంగా పరిగణనలోకి తీసుకొని అవసరమైన సవరణలు చేసి జి.ఓ. 103ను జారీ చేసినట్లు వెల్లడించారు. ఈ సవరణల ద్వారా రాష్ట్రవ్యాప్తంగా ప్రింట్ మీడియా, ఎలక్ట్రానిక్ మీడియా మరియు డిజిటల్ మీడియా విభాగాల్లో మొత్తం 44,706 అక్రిడిటేషన్ కార్డులు పొందే అవకాశం కలుగుతుందని తెలిపారు.

గతంలో సుమారు 23 వేల మందికి మాత్రమే అక్రిడిటేషన్ కార్డులు ఉండగా, తాజా నిర్ణయంతో దాదాపు 21 వేలకు పైగా కార్డుల సంఖ్య పెరుగుతుందని మంత్రి వివరించారు. 2.50 లక్షల పైగా సర్క్యులేషన్ ఉన్న 8 పత్రికలకు 6,256 కార్డులు, 75 వేల నుండి 2.50 లక్షల వరకు సర్క్యులేషన్ ఉన్న 24 పత్రికలకు 17,784 కార్డులు , 25001 నుంచి 75 వేల వరకు సర్క్యులేషన్ ఉన్న 30 పత్రికలకు 3,390, అదేవిధంగా 15001 నుంచి 25000 వరకు సర్క్యులేషన్ ఉన్న 169 చిన్న పత్రికలకు 11,661, 15వేలలోపు సర్క్యులేషన్ ఉన్న 113 చిన్న పత్రికలకు 226, పీరియాడికల్స్‌కు 624, 20 న్యూస్ ఏజన్సీలకు 68 అక్రిడిటేషన్‌లు పొందుతాయని తెలిపారు. అలాగే 21 శాటిలైట్ ఛానళ్లకు 4,431 కార్డులు, 8 జాతీయ ఛానల్స్‌కు 32, వంద లోకల్ కేబుల్ ఛానళ్లకు 200, డిజిటల్ మీడియా విభాగానికి 10 కార్డులు మొత్తంగా 44,706 కార్డులు కేటాయించినట్లు తెలిపారు. ఇందులో రాష్ట్ర మరియు జిల్లా స్థాయిలో 16,056, నియోజకవర్గ మరియు మండల స్థాయిలో 28,650 మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. అక్రిడిటేషన్ కార్డుల జారీ నిరంతర ప్రక్రియ అని, అవసరాన్ని బట్టి మరోసారి సమావేశమై తదుపరి చర్యలు తీసుకోవాలని నిర్ణయించినట్లు మంత్రి తెలిపారు. ప్రజాస్వామ్యంలో నాలుగో స్థంభంగా ఉన్న మీడియా ప్రతినిధుల గౌరవం, భద్రత, సంక్షేమం ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యమని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు.

# ఉగాదికి సనత్‌నగర్ టిమ్స్ ప్రారంభం

(మొదటి పేజీ తరువాయి)

ఈలోగా సివిల్ పనులు, పరికరాల అమరిక, ప్రయోగ పరీక్షలు పూర్తి చేసి వైద్య సేవలకు సిద్ధం చేయాలని రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అధికారులను ఆదేశించారు. గురువారం హైదరాబాద్‌లోని ఆరోగ్యశ్రీ ట్రస్ట్ కార్యాలయంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆసుపత్రి పురోగతిపై మంత్రి ఆరా తీశారు. 1000 పడకల సామర్థ్యంతో నిర్మించిన ఈ ఆసుపత్రిలో 16 శస్త్రచికిత్స గదులు సిద్ధంగా ఉన్నాయని అధికారులు తెలిపారు. సీటీ స్కాన్, ఎంఆర్ఐ, డిజిటల్ ఎక్స్‌రే వంటి అత్యాధునిక నిర్ధారణ పరికరాల అమరిక పూర్తయిందని, మిగిలిన యంత్రాల ఏర్పాటు కూడా తుదిదశలో ఉందని వివరించారు. మార్చి రెండో వారానికి అన్ని పనులు పూర్తి చేసి సిబ్బందికి శిక్షణ ఇవ్వాలని మంత్రి సూచించారు. సనత్‌నగర్ టిమ్స్‌ను గుండె సంబంధిత చికిత్సలకు ప్రత్యేక ప్రతిభా కేంద్రంగా, అవయవ మార్పిడి శస్త్రచికిత్సల కేంద్రంగా తీర్చిదిద్దాలని మంత్రి స్పష్టం చేశారు. క్యాథ్‌ల్యాబ్ ఏర్పాట్లు, అవయవ మార్పిడి శస్త్రచికిత్స గదుల ఏర్పాటుపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. నగరంలోని ఇతర ప్రభుత్వ ఆసుపత్రులపై ఉన్న రోగుల ఒత్తిడిని తగ్గించడంలో ఈ ఆసుపత్రి కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. వైద్య సేవలతో పాటు పారిశుధ్యం, భద్రత, రోగి సేవల విభాగాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని మంత్రి సూచించారు. రోగులకు ఓపీ నమోదు నుంచి డిశ్చార్జి వరకు అన్ని సేవలను ఈవ్యవస్థ ద్వారా అనుసంధానించాలని ఆదేశించారు. నాణ్యమైన ఆహారం అందించేందుకు కేంద్రీకృత వంటశాల ఏర్పాటు చేయాలని తెలిపారు. ఉగాది నాటికి ఆసుపత్రి పూర్తిస్థాయిలో సిద్ధమై ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని మంత్రి స్పష్టం చేశారు.

## కార్పొరేషన్ ఎన్నికల్లో
# గులాబీ జెండానే ఎగురుతుంది: కేటీఆర్

(మొదటి పేజీ తరువాయి)

ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ కార్యకర్తల్లో ఉత్సాహాన్ని నింపారు. ఎమ్మెల్యేలు వెళ్లినా పార్టీ వెన్నెముక కార్యకర్తలేనన్నారు. శేరిలింగంపల్లి ఎమ్మెల్యే పార్టీని వీడినా కార్యకర్తలు మాత్రం కేసీఆర్ నాయకత్వంలోనే ఉన్నారని ప్రశంసించారు. శేరిలింగంపల్లి నియోజకవర్గం పార్టీకి నంబర్ వన్ కోటగా నిలిచిందని, 24 డివిజన్లలో క్లీన్ స్వీప్ చేసే సత్తా తమకుందని ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ అబద్ధపు హామీలతో అధికారం దక్కించుకుందని, బీజేపీ తెలంగాణకు పనికిరాని పార్టీగా మారిందని కేటీఆర్ విమర్శించారు. తెలంగాణకు కేసీఆర్ నాయకత్వమే శ్రీరామరక్ష అని పేర్కొన్నారు. నగరంలో శాంతిభద్రతలు అదుపు తప్పాయని, వ్యాపారాలు కుదేలయ్యాయని ఆరోపించారు. త్వరలో కార్పొరేషన్ ఎన్నికల దృష్ట్యా డివిజన్ల వారీగా సమావేశాలు నిర్వహించి పార్టీని మరింత పటిష్టం చేస్తామని తెలిపారు. ఎమ్మెల్యేలు లేకపోయినా కార్యకర్తలకు అండగా తాను, తలసాని శ్రీనివాస్ యాదవ్, అరికెపూడి, కృష్ణారావు ఉంటామని హామీ ఇచ్చారు. చదువుకున్న యువత రాజకీయాల్లోకి రావడం శుభపరిణామమని, విజయ్ కుమార్ రెడ్డి వంటి యువ నాయకులు పార్టీకి ఆస్తి అని కేటీఆర్ పేర్కొన్నారు.

# బలహీన వర్గాల అభ్యున్నతికి బడ్జెట్‌లో ప్రత్యేక ప్రతిపాదనలు

**హైదరాబాద్, ఫిబ్రవరి 12 (తెలంగాణ ముచ్చట్లు):**

- బీసీ సంక్షేమ శాఖపై సమగ్ర సమీక్ష
- విజన్ 2047 లక్ష్యాలకు అనుగుణంగా రవాణా శాఖ కార్యాచరణ
- 2026–27 బడ్జెట్‌కు దిశానిర్దేశం



బలహీన వర్గాల జీవన ప్రమాణాలు పెంపొందించేలా రాబోయే బడ్జెట్‌లో బీసీ సంక్షేమ శాఖ ప్రతిపాదనలు ఉండేలా చర్యలు తీసుకోవాలని మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులను ఆదేశించారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన కేటాయింపులు, విడుదలైన నిధులు, చేసిన ఖర్చులు, ఇంకా పెండింగ్‌లో ఉన్న అంశాలపై బీసీ సంక్షేమ శాఖ, రవాణా శాఖలపై వేర్వేరుగా సమీక్షా సమావేశాలు నిర్వహించారు.

బీసీ సంక్షేమ శాఖలో విద్యార్థుల స్కాలర్‌షిప్‌లు, బీసీ హాస్టళ్ల నిర్వహణ, స్టడీ సర్కిళ్లలో శిక్షణ, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు, కళ్యాణలక్ష్మి, రజకులు, నాయి బ్రాహ్మణులకు ఉచిత విద్యుత్, కాటమయ్య రక్షణ కవచాలు తదితర పథకాల అమలుపై అధికారులు వివరాలు సమర్పించారు. నిధుల విడుదలలో ఎలాంటి ఇబ్బందులు లేవని, లబ్ధిదారులకు సక్రమంగా ప్రయోజనం అందేలా జాగ్రత్తలు తీసుకోవాలని మంత్రి సూచించారు. 2026-27 బడ్జెట్‌లో చేర్చాల్సిన కొత్త ప్రతిపాదనలపై కూడా అధికారులకు మార్గనిర్దేశం చేశారు. డిప్యూటీ సీఎం, ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్క నేతృత్వంలో జరుగుతున్న బడ్జెట్ సన్నాహక సమావేశాల్లో బలహీన వర్గాల ఆర్థిక వృద్ధికి దోహదపడే అంశాలను ప్రాధాన్యంగా చర్చించాలని మంత్రి పేర్కొన్నారు. జీవన ప్రమాణాలు మెరుగుపడే విధంగా ప్రత్యేక ప్రణాళికలు రూపొందించాలని ఆదేశించారు.

రవాణా శాఖ, ఆర్టీసీ పరిధిలో విజన్ 2047 లక్ష్యాలకు అనుగుణంగా కార్యాచరణ ముందుకు తీసుకెళ్లాలని మంత్రి సూచించారు. రాబోయే ఆర్థిక సంవత్సరంలో సొంత భవనాలు లేని కార్యాలయాలకు భవన నిర్మాణ ప్రతిపాదనలు సిద్ధం చేయాలని, కొత్త బస్సుల కొనుగోలు, ఉద్యోగ నియామకాలు, పెండింగ్ అంశాల పరిష్కారంపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సమీక్షా సమావేశంలో స్పెషల్ చీఫ్ సెక్రటరీ వికాస్ రాజ్, బీసీ సంక్షేమ శాఖ సెక్రటరీ శ్రీధర్, ఎంజేపి సెక్రటరీ సైదులు, జేటీసీలు చంద్రశేఖర్ గౌడ్, శివలింగయ్య, బీసీ సంక్షేమ శాఖ అధికారులు, ఆర్టీసీ అధికారులు పాల్గొన్నారు.

## గ్రామ పంచాయతీలకు రూ.646.46 కోట్ల ఆర్థిక సంఘం నిధులు విడుదల

(మొదటి పేజీ తరువాయి)

దీంతో రెండు విడతల్లో కలిపి మొత్తం రూ.646.46 కోట్ల నిధులు గ్రామ పంచాయతీల ఖాతాల్లో జమయ్యాయి. ఈ నిధులతో గ్రామపంచాయతీల్లో పెండింగ్‌లో ఉన్న పనులు, మౌలిక సదుపాయాల అభివృద్ధికి ఊతం లభించనుంది. తాగునీరు, పారిశుధ్యం, రహదారులు, వీధి దీపాలు వంటి అవసరాలకు ఈ నిధులు వినియోగించనున్నట్లు అధికారులు తెలిపారు. ఇంకా కేంద్రం నుంచి గ్రామ పంచాయతీలకు రావాల్సిన రూ.2,400 కోట్ల నిధులు పెండింగ్‌లో ఉన్నట్లు సమాచారం. గ్రామాల్లో అభివృద్ధి కుంటుపడకుండా ఉండటానికి పెండింగ్ నిధులను వెంటనే విడుదల చేయాలని తెలంగాణ మంత్రి సీతక్క కేంద్రానికి విజ్ఞప్తి చేశారు. ఈ క్రమంలో కేంద్రం నుంచి విడతలవారీగా నిధులు విడుదలవుతున్నాయి. గ్రామీణాభివృద్ధి కార్యక్రమాలు సజావుగా కొనసాగేందుకు అవసరమైన నిధులను పూర్తిస్థాయిలో విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వం కోరుతోంది.

## ఓటు వేయలేదని డబ్బులు, కుక్కర్లు తిరిగి అడిగిన అభ్యర్థిపై ఆగ్రహం

**భద్రాద్రి కొత్తగూడెం, ఫిబ్రవరి 12 (తెలంగాణ ముచ్చట్లు):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మున్సిపాలిటీలోని 10వ వార్డులో ఓ కాంగ్రెస్ అభ్యర్థి ప్రవర్తన వివాదాస్పదంగా మారింది. తనకు ఓటు వేయలేదని ఆరోపిస్తూ ముందుగా పంచిన డబ్బులు, కుక్కర్లు తిరిగి ఇవ్వాలని ప్రజలను కోరినట్లు సమాచారం. స్థానికుల వాదన ప్రకారం, ఓటు వేయలేదని కారణం చూపుతూ అభ్యర్థి అవమానకరంగా మాట్లాడినట్లు ఆరోపించారు. దీంతో అక్కడ ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. డబ్బులు, కుక్కర్లు ఇవ్వమని ఎవరడిగారని, ఎందుకు ప్రజలను అవమానిస్తున్నారని స్థానికులు నిలదీశారు. ఈ ఘటనపై వార్డు ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల సమయంలో ప్రలోభాలకు గురి చేసి, అనంతరం అవమానకరంగా వ్యవహరించడం తగదని పేర్కొన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు స్వేచ్ఛగా వినియోగించుకోవాల్సిన హక్కు అని స్పష్టం చేశారు. ఈ సంఘటనపై స్థానిక అధికారులు ఆరా తీస్తున్నట్లు సమాచారం. అవసరమైతే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

## కాళేశ్వరం మిగులు పనుల పర్యవేక్షణ

**సిద్ధిపేట, ఫిబ్రవరి 12 (తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణ ప్రాంత రైతాంగానికి జీవధారగా నిలిచిన కాలేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించిన మిగులు పనులను త్వరితగతిన పూర్తి చేయాలని మాజీ మంత్రి, స్థానిక ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావు ఆదేశాల మేరకు బీఆర్ఎస్ నాయకులు పర్యవేక్షణ చేపట్టారు. వేసవి కాలం సమీపిస్తుండటంతో భూగర్భ జలాలు తగ్గిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేసిన చిన్నకోడూరు మండల రైతులు బుధవారం తన్నీరు హరీష్ రావును కలిసి తమ సమస్యలను వివరించారు. రైతుల ఇబ్బందులను విన్న ఎమ్మెల్యే అధికారులతో సమీక్ష నిర్వహించి మిగిలి ఉన్న కాల్వ పనులను వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ మేరకు గురువారం మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు కాముని శ్రీనివాస్ ఆధ్వర్యంలో అధికారులు, పార్టీ నాయకులు కలిసి కాల్వ పనులను పరిశీలించారు. కాల్వ నిర్మాణానికి అవసరమైన భూమి విషయంలో రైతులను ఒప్పించి పనులు వేగవంతం చేయాలని నిర్ణయించారు. రెండు రోజుల్లో మిగిలిన పనులు పూర్తి చేసి బెల్లంకుంట, చిన్నకోడూరు సహా పలు గ్రామాల రైతులకు సాగునీరు అందిస్తామని అధికారులు హామీ ఇచ్చారు. కాళేశ్వరం ప్రాజెక్టు తెలంగాణ రైతులకు జీవాధారమని శ్రీనివాస్ పేర్కొన్నారు.

### సింగరేణి చైర్మన్‌గా డాక్టర్ జ్యోతి బుద్ధ ప్రకాష్
## బాధ్యతల స్వీకారం

**హైదరాబాద్, ఫిబ్రవరి 12 (తెలంగాణ ముచ్చట్లు):** సింగరేణి సంస్థ చైర్మన్, ఎండీగా నియమితులైన సీనియర్ ఐఏఎస్ అధికారి డాక్టర్ జ్యోతి బుద్ధ ప్రకాష్ గురువారం హైదరాబాద్‌లోని సింగరేణి భవన్‌లో అధికారిక బాధ్యతలు స్వీకరించారు. 2002 బ్యాచ్ తెలంగాణ కేడర్‌కు చెందిన డాక్టర్ జ్యోతి బుద్ధ ప్రకాష్ గతంలో షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖకు ప్రభుత్వ కార్యదర్శిగా సేవలందించారు. రవాణా, భూమి రికార్డులు, సామాజిక సంక్షేమ రంగాల్లో విస్తృత అనుభవం కలిగి ఉన్నారు. రిజిస్ట్రేషన్ మరియు స్టాంపుల కమిషనర్, ఇన్‌స్పెక్టర్ జనరల్, సర్వే సెటిల్మెంట్లు మరియు ల్యాండ్ రికార్డ్స్ కమిషనర్, భూభారతి ప్రాజెక్ట్ డైరెక్టర్ వంటి కీలక బాధ్యతలు నిర్వహించారు. సింగరేణి సంస్థను మరింత అభివృద్ధి పథంలో నడిపించేందుకు కృషి చేస్తానని ఆయన బాధ్యతల స్వీకారం సందర్భంగా తెలిపారు.

## జగ్గారెడ్డిపై కేసు నమోదు

- పోలింగ్ కేంద్రంలో ఉద్రిక్తత
- సీఐపై ఆరోపణలు
- న్యాయస్థానంలో తేలుతుందని జగ్గారెడ్డి వ్యాఖ్య

**సంగారెడ్డి, ఫిబ్రవరి 12 (తెలంగాణ ముచ్చట్లు):** పురపాలక ఎన్నికల పోలింగ్ సందర్భంగా ఎన్నికల సిబ్బంది విధులకు ఆటంకం కలిగించారనే ఆరోపణలతో కాంగ్రెస్ నేత, మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డిపై పోలీసులు కేసు నమోదు చేశారు. సంబంధిత అధికారుల ఫిర్యాదు మేరకు సంగారెడ్డి పోలీస్ స్టేషన్‌లో భారతీయ న్యాయ సంహితలోని 223, 351, 352, 132, 329 సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. బుధవారం జరిగిన పోలింగ్ సమయంలో సంగారెడ్డిలోని 34వ వార్డు పోలింగ్ కేంద్రం వద్ద ఉద్రిక్తత చోటుచేసుకుంది. కాంగ్రెస్ అభ్యర్థిని సర్కిల్ ఇన్‌స్పెక్టర్ గల్లా పట్టి ఈడ్చుకెళ్లారని ఆ పార్టీ నేతలు ఆరోపించారు. సమాచారం అందుకున్న జగ్గారెడ్డి తన అనుచరులతో పోలింగ్ బూత్‌కు చేరుకుని పోలీసుల చర్యలను ప్రశ్నించారు. ఈ క్రమంలో పోలింగ్‌ను ఆపేస్తామని హెచ్చరించడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. ముందుజాగ్రత్త చర్యగా పోలీసులు జగ్గారెడ్డితో పాటు కార్యకర్తలను అడ్డుకున్నారు. తనపై కేసు నమోదు చేయడంపై జగ్గారెడ్డి స్పందిస్తూ, దొంగ ఓట్లను అడ్డుకున్న తమ నేతపై సీఐ దాడి చేశారని ఆరోపించారు. తమ అభ్యర్థిని కొట్టినందుకే సీఐని తిట్టాల్సి వచ్చిందని తెలిపారు. సీఐ శివకుమార్ బీఆర్ఎస్ అభ్యర్థికి సహకరించారని ఆరోపించారు. ఎన్నికల నిబంధనలను ఎవరైనా ఉల్లంఘించినా చర్యలు తీసుకోవాలని, ఈ ఘటనలో తప్పు ఎవరిదో న్యాయస్థానంలో తేలుతుందని స్పష్టం చేశారు. అదేవిధంగా బీఆర్ఎస్ సోషల్ మీడియా పోస్టులపై కూడా జగ్గారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో బీఆర్ఎస్ నేతలు పోలీసులపై ప్రవర్తించిన తీరు గురించి ముందుగా మాట్లాడాలని సూచించారు. నిన్నటి ఘటనను తాను అక్కడితో వదిలేశానని, అయితే సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేయడాన్ని ఖండిస్తున్నట్లు తెలిపారు. మొత్తంగా ఈ ఘటనతో సంగారెడ్డిలో రాజకీయ వాతావరణం మరింత ఉద్రిక్తంగా మారింది.




# మార్చి 1న మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు రాక

- ఖమ్మంలో భారతరత్న అటల్ బిహారి వాజ్ పేయి శతజయంతి ఉత్సవాలు


**ఖమ్మం బ్యూరో, ఫిబ్రవరి 12 (తెలంగాణ ముచ్చట్లు)**

మాజీ ప్రధాని భారతరత్న అటల్ బిహారి వాజ్ పేయి శతజయంతి ఉత్సవాలు మార్చి 1న ఖమ్మంలో పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నట్లు అటల్ బిహారి వాజ్ పేయి ఉత్సవ కమిటీ అధ్యక్షులు దుద్దుకూరి వెంకటేశ్వర్లు తెలిపారు. ఖమ్మం ప్రెస్ క్లబ్ లో గురువారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో దుద్దుకూరి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. అటల్ బిహారీ వాజ్ పేయి శతజయంతి ఉత్సవాలకు ముఖ్య అతిధులుగా మాజి ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు ఖమ్మం వస్తున్నారని, వారితోపాటు ప్రముఖ కవి, రచయిత, ఉస్మానియా విశ్వవిద్యాలయం మాజీ ఆచార్యులు కసిరెడ్డి వెంకటరెడ్డి, అఖిలభారత సామాజిక సమరసత కళావిభాగం కన్వీనర్ అప్పాల ప్రసాద్, రాష్ట్ర మంత్రులు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు, వ్యవసాయ శాఖ మాత్యులు తుమ్మల నాగేశ్వరరావు, రెవెన్యూ శాఖ మాత్యులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి హాజరవుతున్నారని తెలిపారు. ఖమ్మం ఎస్సార్ గార్డెన్ లో జరిగే అటల్ బిహారి వాజ్ పేయి శతజయంతి ఉత్సవాలలో 'అటల్ జీకి అక్షర నీరాజనం కవితా సంకలనం' పుస్తక ఆవిష్కరణ ఉంటుందన్నారు. భారతదేశాన్ని ప్రగతి బాటలో నడిపిన మహా నాయకుడు వాజ్ పేయి అని, వారు చూపిన మార్గాన్ని భావితరాలకు చేరేవిధంగా శతజయంతి వేడుకలను ఖమ్మంలో ఘనంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు. ఈ విలేకరుల సమావేశంలో ఉత్సవ కమిటీ ప్రధాన కార్యదర్శి మందడపు ప్రభాకర్ రెడ్డి, ఉపాధ్యక్షులు వడ్లమూడి సురేష్, కోశాధికారి మల్లెంపాటి రమేష్, కార్యదర్శులు యలమందల మధు, బోళ్ల బిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

# మహాశివరాత్రి సందర్భంగా నీలాద్రికి 25 ప్రత్యేక బస్సులు

- సత్తుపల్లి డిపో నుంచి భక్తుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు

**సత్తుపల్లి, ఫిబ్రవరి 12 (తెలంగాణ ముచ్చట్లు):**



మహాశివరాత్రి సందర్భంగా నీలాద్రిశ్వరుని ఆలయానికి భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని సత్తుపల్లి ఆర్టీసీ డిపో నుంచి 25 ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు డిపో మేనేజర్ గురిజాల లక్ష్మీనారాయణ తెలిపారు. ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈ ఏడాది కూడా భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక సర్వీసులు ఏర్పాటు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. సత్తుపల్లి నుంచి నీలాద్రికి పెద్దలకు రూ.50, పిల్లలకు రూ.30 చార్జీగా నిర్ణయించినట్లు తెలిపారు. అదేవిధంగా వి.ఎం. బంజర నుంచి కూడా నీలాద్రికి ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు చెప్పారు. అలాగే సత్తుపల్లి నుంచి అన్నపురెడ్డిపల్లి శివాలయానికి కూడా ప్రత్యేక సర్వీసులు ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఈ నెల 15వ తేదీ ఆదివారం తెల్లవారుజామున 4 గంటల నుంచి 16వ తేదీ ఉదయం 6 గంటల వరకు ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు తెలిపారు. భక్తుల రద్దీని బట్టి అదనపు సర్వీసులు కూడా ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ పి. ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు.




# సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికుల భారీ ర్యాలీ

**కీసర, ఫిబ్రవరి 12 (తెలంగాణ ముచ్చట్లు):**

జాతీయ సమ్మె సందర్భంగా కీసర చౌరస్తాలోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహం వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో మానవహారం నిర్వహించారు. అనంతరం కీసర చౌరస్తా నుంచి కీసర సర్కిల్-01 కార్యాలయం వరకు కార్మికులు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ విషయాన్ని సీఐటీయూ కీసర మండల కమిటీ కార్యదర్శి బంగారు నర్సింగరావు తెలిపారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ప్రజాతంత్ర ఉద్యమ నాయకురాలు ఎం. వినోద మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను అమలు చేస్తోందని విమర్శించారు. కార్మిక చట్టాలను బలహీనపరుస్తూ నాలుగు లేబర్ కోడ్‌లను అమలు చేయడం వల్ల కార్మికుల హక్కులు దెబ్బతింటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే ఆ నాలుగు లేబర్ కోడ్‌లను ఉపసంహరించుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.సీఐటీయూ మండల కార్యదర్శి బంగారు నర్సింగరావు మాట్లాడుతూ కార్మికులందరికీ ఉపాధి, ఉద్యోగ భద్రత కల్పించాలని, కనీస వేతనం రూ.26,000 అమలు చేయాలని కోరారు. ప్రతి కార్మికునికి ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యాలు అందించాలని, కాంట్రాక్ట్ మరియు ఔట్‌సోర్సింగ్ విధానంలో ఉన్న మున్సిపల్ కార్మికులను శాశ్వతీకరించాలని డిమాండ్ చేశారు. రిటైర్మెంట్ బెనిఫిట్లు కల్పించడంతో పాటు 8 గంటల పని దినాన్ని కొనసాగించాలని అన్నారు. ప్రతి మున్సిపల్ కార్మికునికి మూడు నెలలకు ఒకసారి అవసరమైన కిట్లు అందజేయాలని, విధి నిర్వహణలో మరణించిన కార్మికుల కుటుంబాలకు రూ.25 లక్షల ఆర్థిక సాయం అందించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరారు.ఈ కార్యక్రమంలో కీసర, గోధుమకుంట, కరీంగూడా, రాంపల్లి దాయరా ప్రాంతాలకు చెందిన మున్సిపల్ కార్మికులు పాల్గొన్నారు. సీఐటీయూ నాయకులు చింతకింది అశోక్, సుదర్శన్, భాగ్య, పోచయ్య, లలిత, నికిత, సుశీల, మణెమ్మ, పెంటమ్మ, పుష్పలత, బాలమ్మ, లీలమ్మ, లక్ష్మీనరసింహ, భద్రమ్మ, భద్రయ్య, జాన్ మోష, అరుణ, అశ్విని, మైసయ్య, సునీత, రమేష్ తదితరులు హాజరయ్యారు.

# ఓటమి భయంతో గిఫ్టుల వసూలు?

- 10వ వార్డులో ఉద్రిక్తత.

**అశ్వరావుపేట, ఫిబ్రవరి 12 (తెలంగాణ ముచ్చట్లు):**



అశ్వరావుపేట మున్సిపాలిటీ 10వ వార్డు కౌన్సిలర్ ఎన్నికల నేపథ్యంలో ఓ ఆసక్తికర పరిణామం చోటుచేసుకున్నట్లు సమాచారం. తనను గెలిపించాలని ఓటర్లను ప్రలోభ పెట్టి గిఫ్టులు, నగదు పంపిణీ చేసిన కాంగ్రెస్ అభ్యర్థి, ఇప్పుడు ఓటమి భయంతో వాటిని తిరిగి వసూలు చేస్తున్నాడని ఆరోపణలు వినిపిస్తున్నాయి. శుక్రవారం జరగనున్న ఓట్ల లెక్కింపులో తాను ఓడిపోతానన్న అనుమానంతో, ఓటర్ల ఇళ్లకు వెళ్లి ముందుగా ఇచ్చిన గిఫ్టులు, నగదు తిరిగి ఇవ్వాలని ఒత్తిడి తెస్తున్నట్లు స్థానికులు చెబుతున్నారు. తనకు ఓటు వేయకుండా ఇతర పార్టీల అభ్యర్థులకు మద్దతు ఇచ్చారని ఆరోపిస్తూ, ఇచ్చిన కుక్కర్లు, ఇతర గృహోపకరణాలు తిరిగి తీసుకునేందుకు ప్రయత్నిస్తున్నాడని సమాచారం.
అధికార పార్టీ అండతో ఓటర్లపై ఒత్తిడి తీసుకొస్తూ ఇబ్బందులకు గురి చేస్తున్నారని కొందరు ఆరోపిస్తున్నారు. ఈ ఘటనపై స్థానికంగా చర్చనీయాంశమైంది. ఇటువంటి చర్యలకు ప్రజలు తగిన బుద్ధి చెప్పాలని పలువురు కోరుతున్నారు. ఇదిలా ఉండగా, 10వ వార్డులో ఆధార్ పార్టీ అభ్యర్థి కరిష్మా గెలిచే అవకాశాలు మెండుగా ఉన్నాయని ఆమె అనుచరులు భావిస్తున్నారు. ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండే ఆమెకు మద్దతుగా ఓటర్లు సమాయత్తమయ్యారని పేర్కొంటున్నారు. ఈ పరిస్థితుల నేపథ్యంలో అధికార పార్టీ అభ్యర్థి ఓటమి భయంతో ఇలాంటి చర్యలకు దిగుతున్నాడనే విమర్శలు వినిపిస్తున్నాయి.

# హరిత ఎంక్లేవ్‌లో మురుగునీటి సమస్యపై స్వర్ణరాజ్ శివమణి పర్యటన

**కాప్రా, ఫిబ్రవరి 12 (తెలంగాణ ముచ్చట్లు):**



ఉప్పల్ నియోజకవర్గం కాప్రా డివిజన్ పరిధిలోని హరిత ఎంక్లేవ్ కాలనీలో నెలకొన్న మురుగునీటి సమస్యపై స్వర్ణరాజ్ శివమణి కాలనీవాసులతో కలిసి పర్యటించారు. కాలనీ ప్రధాన రహదారిలో యూజీడీ పైప్‌లైన్ తరచుగా పొంగిపొర్లుతూ మురుగునీరు రోడ్లపై నిలుస్తుండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు ఆయన దృష్టికి తీసుకువచ్చారు.సమస్య విషయం తెలిసిన వెంటనే కాలనీలోకి వచ్చి హెచ్ఎండబ్ల్యుఎస్ఎస్‌బి అధికారులతో మాట్లాడి సిబ్బందిని పిలిపించి భూగర్భ పైప్‌లైన్ మ్యాన్‌హోళ్లను శుభ్రం చేయించామని స్వర్ణరాజ్ శివమణి తెలిపారు. పలువురు పాదాచారులు, వాహనదారులు మురుగునీటిలో జారిపడి ప్రమాదాలకు గురవుతున్న పరిస్థితి ఉందని కాలనీవాసులు వాపోయారని చెప్పారు. సంబంధిత అధికారులకు, హెల్ప్‌లైన్‌కు ఫిర్యాదులు చేసినా సమస్యకు శాశ్వత పరిష్కారం లభించలేదని పేర్కొన్నారు.హరిత ఎంక్లేవ్‌లో ఇప్పటికే సీసీ రోడ్లు, భూగర్భ డ్రైనేజీ, విద్యుత్ స్థంబాలు, వీధి దీపాల ఏర్పాటు వంటి అభివృద్ధి పనులు చేపట్టినట్లు గుర్తుచేసిన ఆయన, ప్రధాన రహదారిలో పాత డ్రైనేజీ స్థానంలో రూ.1.80 కోట్ల నిధులతో భూగర్భ బాక్స్ డ్రైనేజీ వ్యవస్థను త్వరలో నిర్మిస్తామని హామీ ఇచ్చారు. అదేవిధంగా పార్క్ స్థలంలో చైన్ ఫెన్సింగ్, వాకింగ్ ట్రాక్, ఓపెన్ జిమ్, పిల్లల ఆట స్థలం, శౌచాలయాలు, సౌందర్య వనంతో ఆధునిక పార్క్ నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి, ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తోందని ఆయన పేర్కొన్నారు.సమస్య పరిష్కారానికి తక్షణ స్పందన చూపిన స్వర్ణరాజ్ శివమణికి కాలనీవాసులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యుఏ ప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.




# కల్లూరు మున్సిపల్ ఓట్ల లెక్కింపుకు పటిష్ఠ భద్రతా ఏర్పాట్లు

- ప్రశాంత, పారదర్శక కౌంటింగ్‌కు చర్యలు.
- ఏసీపీ వసుంధర యాదవ్.

**కల్లూరు, ఫిబ్రవరి 12 (తెలంగాణ ముచ్చట్లు):**

కల్లూరు డివిజన్‌లో నేడు (శుక్రవారం) మున్సిపల్ ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు పోలీసులు పటిష్ఠ భద్రతా ఏర్పాట్లు చేపట్టినట్లు ఏసీపీ వసుంధర యాదవ్ తెలిపారు. అన్ని కౌంటింగ్ కేంద్రాలు మరియు స్ట్రాంగ్‌రూమ్‌ల వద్ద 24 గంటల పోలీసు నిఘా కొనసాగుతోందని, మూడు అంచెల భద్రతా వ్యవస్థను అమలు చేస్తున్నట్లు వెల్లడించారు. కౌంటింగ్ హాళ్లలోకి మొబైల్ ఫోన్లు, పెన్నులు, ఇంక్, ఎలక్ట్రానిక్ పరికరాలు, బ్యాగులు తదితర అనధికార వస్తువులు తీసుకురావడం ఖచ్చితంగా నిషేధించినట్లు తెలిపారు. చెల్లుబాటు అయ్యే గుర్తింపు కార్డులు కలిగిన అధీకృత సిబ్బంది మరియు ఎన్నికల అధికారుల ఆమోదం పొందిన కౌంటింగ్ ఏజెంట్లకు మాత్రమే ప్రవేశం కల్పిస్తామని స్పష్టం చేశారు. ట్రాఫిక్ రద్దీ నివారణకు అవసరమైన చోట్ల మళ్లింపులు చేపట్టినట్లు, ప్రత్యేక పార్కింగ్ సదుపాయాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మోడల్ ప్రవర్తనా నియమావళి అమలులో ఉన్న నేపథ్యంలో కౌంటింగ్ కేంద్రాల సమీపంలో సమావేశాలు, నినాదాలు లేదా ఏ విధమైన ఆందోళనలు అనుమతించబోమని హెచ్చరించారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఏసీపీ తెలిపారు.

# బీజేపీ విధానాలకు వ్యతిరేకంగా దేశవ్యాప్త సమ్మె–వనపర్తిలో భారీ నిరసన ర్యాలీ

**వనపర్తి,ఫిబ్రవరి12(తెలంగాణ ముచ్చట్లు):**



కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న ఉద్యోగ, కార్మిక, రైతు వ్యతిరేక విధానాలకు నిరసనగా దేశవ్యాప్తంగా నిర్వహించిన సమ్మెకు మద్దతుగా వనపర్తి జిల్లా కేంద్రంలో కార్మిక సంఘాల ఆధ్వర్యంలో భారీ నిరసన సభ, ర్యాలీ నిర్వహించారు. సభ అనంతరం పట్టణ ప్రధాన వీధుల గుండా బారిర్యాలీ చేపట్టారు.సభకు సిఐటియు జిల్లా కార్యదర్శి ఎం. రాజు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా టియుసిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి పి. అరుణ్ కుమార్, సిఐటియు జిల్లా కార్యదర్శి మండ్ల రాజు, ఏఐటియుసి జిల్లా కార్యదర్శి తదితరులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ కార్మిక, రైతు వ్యతిరేక విధానాలను తీవ్రంగా విమర్శించారు. దేశవ్యాప్తంగా సుమారు 30 కోట్ల మంది ఈ సమ్మెలో పాల్గొన్నట్లు తెలిపారు.పోరాడి సాధించుకున్న 29 కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు కార్మిక కోడ్‌లుగా మార్చడం ద్వారా కార్మికుల హక్కులను హరించారని ఆరోపించారు. పని గంటలను పెంచే ప్రయత్నాలు, వేతనాల నిర్ణయంలో ఏకపక్ష విధానం, సంఘాల గుర్తింపులో మార్పులు, సామాజిక భద్రత చట్టాలలో సవరణలు చేసి కార్మికులను యజమానుల దయాదాక్షిణ్యాలపై ఆధారపడేలా చేస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటుకు అప్పగించే ప్రయత్నాలు కూడా జరుగుతున్నాయని అన్నారు.రైతు వ్యతిరేక విధానాల కారణంగా వ్యవసాయ రంగం సంక్షోభంలోకి నెట్టబడిందని, పంటలకు గిట్టుబాటు ధరకు చట్టబద్ధ హామీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్పొరేట్ శక్తులకు వేల కోట్లు మన్నిస్తూనే రైతులకు రుణమాఫీ చేయడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం చూపుతోందని విమర్శించారు.ఈ కార్యక్రమానికి సిపిఎం జిల్లా కార్యదర్శి పుట్ట ఆంజనేయులు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. వ్యవసాయ కార్మిక సంఘం, వికలాంగుల సంఘం తదితర ప్రజా సంఘాల నాయకులు పాల్గొని ప్రసంగించారు.

# బండారి రాజిరెడ్డి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహణ

**నాచారం, ఫిబ్రవరి 12 (తెలంగాణ ముచ్చట్లు):**



ఉప్పల్ నియోజకవర్గ తొలి శాసనసభ్యులు కీర్తిశేషులు బండారి రాజిరెడ్డి 79వ జయంతి సందర్భంగా నాచారంలోని ఉదయ్ కుమార్ సినీప్లెక్స్ వద్ద ఆయన చిత్రపటానికి ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమాన్ని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు సాయిజెన్ శేఖర్ ఆధ్వర్యంలో నిర్వహించారు.కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి బండారి రాజిరెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బండారి రాజిరెడ్డి చూపిన సేవా మార్గాన్ని అనుసరిస్తూ ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తున్నానని తెలిపారు. ప్రజా సేవలో ఆయన చూపిన నిబద్ధత తమకు ఆదర్శమని పేర్కొన్నారు.బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు సాయిజెన్ శేఖర్ మాట్లాడుతూ, 2004 మార్చి 14న తన రాజకీయ ప్రస్థానం అప్పటి కాప్రా పట్టణ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులైన బండారి రాజిరెడ్డి ఆశీస్సులతో ప్రారంభమైందని గుర్తుచేశారు. ఆయన నాయకత్వం, మార్గదర్శకం తన రాజకీయ జీవితానికి పునాది వేసిందని అన్నారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు మరియు అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక



# కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డిని కలిసిన పత్తి కుమార్

**మల్కాజిగిరి, ఫిబ్రవరి 12 (తెలంగాణ ముచ్చట్లు):**

మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా పదవీ బాధ్యతలు స్వీకరించిన వినయ్ కృష్ణారెడ్డిని మేడ్చల్ జిల్లా ఎస్సీ విభాగం అధ్యక్షులు, కాప్రా ఉమ్మడి డివిజన్ కాంగ్రెస్ కాంటెస్టెడ్ కార్పొరేటర్ పత్తి కుమార్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కమిషనర్‌కు పూల బొకే అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.నగర అభివృద్ధి, పారిశుధ్యం, మౌలిక సదుపాయాల మెరుగుదలపై ప్రత్యేక దృష్టి సారించాలని కమిషనర్‌ను కోరినట్లు పత్తి కుమార్ తెలిపారు. ప్రజల సమస్యల పరిష్కారంలో తమ వంతు సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో సింగం కిరణ్, సందీప్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# వల్భాపూర్ గ్రామ పంచాయతీ నూతన భవనానికి భూమి పూజ

- **గ్రామ అభివృద్ధే లక్ష్యం: సర్పంచ్ శ్వేత శ్రీనివాస్**

**ఎల్కతుర్తి, ఫిబ్రవరి 12 (తెలంగాణ ముచ్చట్లు):**



హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలం వల్లభాపూర్ గ్రామంలో నూతనంగా ఎన్నికైన గ్రామ సర్పంచ్ శ్వేత శ్రీనివాస్ ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ నూతన భవన నిర్మాణానికి భూమి పూజ కార్యక్రమం శుభప్రదంగా, ఘనంగా నిర్వహించారు.

వేద మంత్రోచ్చారణల మధ్య భూమి పూజ కార్యక్రమం నిర్వహించగా, గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్ శ్వేత శ్రీనివాస్ మాట్లాడుతూ గ్రామ ప్రజలకు మెరుగైన పరిపాలన, పారదర్శక సేవలు అందించేందుకు సౌకర్యవంతమైన, ఆధునిక సదుపాయాలతో కూడిన పంచాయతీ భవనాన్ని నిర్మించనున్నట్లు వెల్లడించారు.

గ్రామ అభివృద్ధే తమ ప్రధాన ధ్యేయమని, తాగునీరు, రహదారులు, పారిశుధ్యం, వీధి దీపాలు వంటి మౌలిక సదుపాయాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారిస్తామని తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న నిధులను సమర్థవంతంగా వినియోగించి గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతామని అన్నారు.

ఉప సర్పంచ్ అనిల్ కుమార్ మాట్లాడుతూ గ్రామాభివృద్ధి కార్యక్రమాల్లో ప్రజల భాగస్వామ్యం అత్యంత అవసరమని, అందరూ కలిసికట్టుగా ముందుకు వస్తే గ్రామం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు రేణుక, కుమార్, శ్రీను, రాధ, కిషోర్, అరుణ, సునీత, నాగరాజు, ముక్క లావణ్య, గ్రామ పెద్దలు, మహిళా సంఘాల ప్రతినిధులు, యువకులు మరియు పెద్ద సంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు.



# నాచారంలో సార్వత్రిక సమ్మె విజయవంతం

- **నాలుగు లేబర్ కోడ్ల ఉపసంహరణకు కార్మిక సంఘాల డిమాండ్**

**నాచారం, ఫిబ్రవరి 12 (తెలంగాణ ముచ్చట్లు):**

కేంద్ర కార్మిక సంఘాల పిలుపు మేరకు నిర్వహించిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె నాచారంలో విజయవంతమైంది. వివిధ పరిశ్రమలకు చెందిన కార్మికులు స్వచ్ఛందంగా విధులను బహిష్కరించి సమ్మెలో పాల్గొన్నారు.సీఐటీయూ మేడ్చల్ జిల్లా కోశాధికారి, నాచారం ఇండస్ట్రియల్ ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి పి. గణేష్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్లు కార్మికుల హక్కులను బలహీనపరుస్తాయని విమర్శించారు. కార్మిక చట్టాలను పెట్టుబడిదారులకు అనుకూలంగా మార్చే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు. వెంటనే నాలుగు లేబర్ కోడ్లను ఉపసంహరించుకోవాలని, కాంట్రాక్ట్ విధానాన్ని తగ్గించి శాశ్వత ఉద్యోగాలను కల్పించాలని, కనీస వేతనాలను పెంచాలని, సమగ్ర సామాజిక భద్రతా హామీలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.ఏఐటీయూసీ రాష్ట్ర నాయకులు వి.ఎస్. బోస్ మాట్లాడుతూ నూతన లేబర్ కోడ్ల వల్ల ఉద్యోగ భద్రత, వేతన హక్కులు, సంఘటిత హక్కులు దెబ్బతినే ప్రమాదం ఉందన్నారు. సంస్థలకు కార్మికులను సులభంగా తొలగించే అవకాశం పెరగడం, పని గంటలు పెరగడం, కనీస వేతనాలపై అనిశ్చితి నెలకొనడం వంటి అంశాలు కార్మిక వర్గానికి ముప్పుగా మారతాయని తెలిపారు.అసంఘటిత రంగం, వలస కార్మికులు ఈ చట్టాల వల్ల తీవ్రంగా ప్రభావితమవుతారని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో రోజువారీ కూలీలు, నిర్మాణ, వ్యవసాయ, చిన్న పరిశ్రమల కార్మికులు ఎక్కువగా నష్టపోతారని ఆందోళన వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో వై. శేఖర్ రెడ్డి, రామకృష్ణ, ప్రభాకర్, స్వామి గౌడ్, సత్యం గౌడ్, నరసింగరావు, బాలరాజ్, రమేష్, ఖదీర్, కృష్ణ, ఉజ్వల్, సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు కల్లూరు ధర్మేంద్ర, సీపీఐ ఉప్పల్ మండల కార్యదర్శి టి. సత్య ప్రసాద్, ఐఎన్టీయూసీ జిల్లా నేత ప్రకాష్ రెడ్డి, ఐఎఫ్టీయూ నాయకురాలు అనురాధ తదితరులు పాల్గొన్నారు.





# క్రీడలతో ప్రపంచ స్థాయి గుర్తింపు సాధ్యం

- **ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి**

**వనపర్తి,ఫిబ్రవరి12(తెలంగాణ ముచ్చట్లు):**

ఉన్నత విద్యతో పాటు క్రీడలపైనా విద్యార్థులు సమానంగా దృష్టి సారించాలని, క్రీడల ద్వారా ప్రపంచ స్థాయి గుర్తింపు సాధించవచ్చని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి పేర్కొన్నారు.గోపాల్పేట మండల కేంద్రంలో నిర్వహిస్తున్న జిల్లా స్థాయి ముఖ్యమంత్రి కప్ క్రికెట్ క్రీడా పోటీలను గురువారం ఆయన ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ క్రీడలు మానసిక ఉల్లాసంతో పాటు దేహదారుఢ్యాన్ని పెంపొందిస్తాయని తెలిపారు.రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు ప్రత్యేక ప్రాధాన్యతనిస్తూ యువతకు అవకాశాలు కల్పిస్తోందని అన్నారు.

క్రీడాకారులు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.జింక, పులి ఉదాహరణను ప్రస్తావిస్తూ లక్ష్యం మీద దృష్టి కేంద్రీకరించాలనే సందేశాన్ని ఇచ్చారు. జింక భయంతో వెనక్కి చూసుకుంటూ పరిగెత్తడం వల్ల పులికి సులభంగా చిక్కుతుందని, అదే విధంగా విద్యార్థులు కూడా భయపడకుండా లక్ష్యాన్ని స్పష్టంగా నిర్ధారించుకుని దానిని సాధించేందుకు కృషి చేయాలని సూచించారు.కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

# లేబర్ కోడ్లు రద్దు చేయాలి.!

- **సార్వత్రిక సమ్మెలో భాగంగా దమ్మపేటలో వామపక్షాల భారీ ర్యాలీ.**

**అశ్వారావుపేట, ఫిబ్రవరి 12 (తెలంగాణ ముచ్చట్లు):**




కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా సార్వత్రిక సమ్మెలో భాగంగా గురువారం దమ్మపేట పట్టణంలో వామపక్ష పార్టీలు, కార్మిక-రైతు సంఘాలు భారీ నిరసన ప్రదర్శన చేపట్టాయి. జీడిగింజల దుకాణాల నుంచి బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. విద్యుత్ సవరణ చట్టం, నూతన విత్తన చట్టాలను ఉపసంహరించుకోవాలని, వ్యవసాయ కార్మికులకు నష్టం చేసే వివిజీ రాంజీ ఉపాధి హామీ విధానాన్ని రద్దు చేసి పాత మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని కొనసాగించాలని కోరారు. పాత విధానం ప్రకారం కేంద్రం 90 శాతం నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్మికులకు నెలకు కనీస వేతనం రూ.26 వేలుగా నిర్ణయించాలని, సంఘటిత, అసంఘటిత రంగ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని నినాదాలు చేశారు. 'డౌన్ డౌన్ మోడీ' అంటూ ఆందోళన వ్యక్తం చేశారు. అనంతరం బస్టాండ్ సెంటర్‌లో తెలంగాణ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు దొడ్డా లక్ష్మీ నారాయణ అధ్యక్షతన సభ నిర్వహించారు. సిపిఐ(ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు అమర్లపూడి రాము, సిపిఐ(ఎం) మండల కార్యదర్శి మొరంపూడి శ్రీనివాస రావు, సిపిఐ మండల కార్యదర్శి సుంకిపాక ధర్మ, సిఐటియు మండల కన్వీనర్ మురహరి రఘు తదితరులు ప్రసంగించారు. కేంద్ర ప్రభుత్వం ప్రైవేటీకరణకు ప్రాధాన్యం ఇస్తూ కార్మికుల హక్కులను హరించే విధానాలు అవలంబిస్తోందని విమర్శించారు. ఎనిమిది గంటల పని విధానాన్ని దెబ్బతీసేలా చర్యలు తీసుకుంటోందని ఆరోపించారు. అమెరికాతో కుదుర్చుకున్న వాణిజ్య ఒప్పందాన్ని రద్దు చేయాలని కూడా డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటి నాయకులు కొప్పుల శ్రీనివాస రావు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు సిహెచ్ బ్రహ్మయ్య, మొరంపూడి కేశవరావు, రావుల శోభనబాబు, పండూరి వీరబాబు, తోడెం దుర్గక్క, గంగాధర, రాఘవులు, గొర్రెపాటి బసవయ్య, పెనుబల్లి ఉదయ్, గెడ్డం రాములు, గూడెం వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# రాధిక చౌరస్తాలో ఆటో కార్మికుల భారీ నిరసన

- **11 డిమాండ్ల సాధన కోసం ధర్నా**
- **మీటర్ చార్జీల పెంపు, టూవీలర్ టాక్సీల నిషేధం డిమాండ్**

**ఏ ఎస్ రావు నగర్, ఫిబ్రవరి 12 (తెలంగాణ ముచ్చట్లు):**




రవాణా రంగ కార్మికుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ గురువారం రాధిక చౌరస్తాలో ఆటో కార్మికులు భారీ స్థాయిలో నిరసన చేపట్టారు. శ్రీ చైతన్య నారాయణ గ్రూప్ మరియు పలు విద్యాసంస్థల ప్రతినిధుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ధర్నాలో ఆటోలను రోడ్డుపై నిలిపివేసి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.ఆటో కార్మికులు పెరుగుతున్న ఇంధన ధరలు, ఫిట్నెస్ ఫీజుల భారంతో పాటు ఆన్‌లైన్ టాక్సీ సంస్థల పోటీ కారణంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సంఘం నాయకులు తెలిపారు. తమ 11 న్యాయమైన డిమాండ్లను వెంటనే అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.ఈ నిరసన కార్యక్రమంలో సంఘం ప్రెసిడెంట్ బాలకృష్ణ, వైస్ ప్రెసిడెంట్ పూసపల్లి రాజేష్, జాయింట్ సెక్రెటరీ ఎండి అనీఫ్, జనరల్ సెక్రెటరీ పి. నవీన్ యాదవ్ పాల్గొన్నారు. భవాన్స్ స్కూల్ ప్రెసిడెంట్ రాజేష్, ఏఎస్ రావు నగర్ ప్రెసిడెంట్ సత్య నారాయణ, భాష్యం స్కూల్ ప్రెసిడెంట్ రాములు నాయక్, వైస్ ప్రెసిడెంట్ బాబు, జాయింట్ సెక్రెటరీ సిద్ధి రాములు తదితరులు సంఘీభావం తెలిపారు. ప్రధాన డిమాండ్లలో ఆటో మీటర్ చార్జీల పెంపు, రవాణా కార్మికుల కోసం ప్రత్యేక సంక్షేమ బోర్డు ఏర్పాటు, ఓలా-ఉబర్-రాపిడో టూవీలర్ టాక్సీల నిషేధం, మోటార్ వాహన చట్టం-2019 రద్దు, 15 ఏళ్లు దాటిన వాహనాల ఫిట్నెస్ ఫీజుల తగ్గింపు, కౌంటర్ సిగ్నేచర్ పర్మిషన్ అమలు, హెవీ డ్రైవింగ్ స్కూల్స్ ఏర్పాటు, హయ్యర్ వెహికల్ చార్జీల పెంపు, ఐటీ టాక్సీల కిలోమీటర్ చార్జీల పెంపు, ఆటోలు-క్యాబులకు ఈచలాన్ల నుంచి మినహాయింపు వంటి అంశాలు ఉన్నాయి. డిమాండ్లపై ప్రభుత్వం స్పందించకపోతే ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని నాయకులు హెచ్చరించారు. ఈ నిరసనలో పెద్ద సంఖ్యలో ఆటో మరియు రవాణా రంగ కార్మికులు పాల్గొన్నారు.

# పటాన్ బస్తీ అభివృద్ధి పనులకు శ్రీకారం

- **నెమలి అనిల్ కుమార్‌కు ఘన సన్మానం**

**మల్లాపూర్, ఫిబ్రవరి 12 (తెలంగాణ ముచ్చట్లు):**

ఉప్పల్ నియోజకవర్గం, మల్లాపూర్ డివిజన్ పరిధిలోని పటాన్ బస్తీ గత పదేళ్లుగా మౌలిక వసతుల కొరతతో అభివృద్ధికి దూరంగా ఉన్న ప్రాంతంగా మారింది. డ్రైనేజీ వ్యవస్థ పూర్తిగా దెబ్బతినడం, తాగునీటి సరఫరా సక్రమంగా లేకపోవడం, రోడ్లు మరియు ఇతర ప్రాథమిక సౌకర్యాల లోపంతో బస్తీ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.ఇటీవల కాంగ్రెస్ నాయకులు నెమలి అనిల్ కుమార్ 'బస్తీబాట' కార్యక్రమంలో భాగంగా పటాన్ బస్తీని సందర్శించి స్థానికులతో సమావేశమై వారి సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకున్నారు. బస్తీ వాసులు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించగా, వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహకారం, ఉప్పల్ కాంగ్రెస్ ఇంచార్జ్ పరమేశ్వర్ రెడ్డి సమన్వయంతో డ్రైనేజీ వ్యవస్థ పునరుద్ధరణ, తాగునీటి సరఫరా మెరుగుదల, ఇతర మౌలిక వసతుల కల్పనకు సంబంధించిన పనులు ఇప్పటికే ప్రారంభమైనట్లు తెలిపారు. సమస్యల పరిష్కారానికి చర్యలు ప్రారంభమవడంతో ఆనందం వ్యక్తం చేసిన పటాన్ బస్తీ ప్రజలు నెమలి అనిల్ కుమార్‌ను ప్రత్యేకంగా ఆహ్వానించి ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా నెమలి అనిల్ కుమార్ మాట్లాడుతూ, "ప్రజల సమస్యలే నా రాజకీయ అజెండా. బస్తీల అభివృద్ధే నా లక్ష్యం. ప్రజల కోసం నా పోరాటం నిరంతరం కొనసాగుతుంది" అని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మల్లాపూర్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి తాండ్ర శ్రీకాంత్ రెడ్డి, సీనియర్ నాయకులు మక్తాల బాలరాజ్ గౌడ్, సురేష్ గౌడ్, మహిళా నాయకురాళ్లు ఇష్రాత్ బానో, ఇంతియాజ్ బేగం, బస్తీ వాసులు హైదర్ భాయ్, రెహ్మాన్ అలీ, ఆర్షద్, ఇబ్రహీం, అలీం, షరీఫ్ భాయ్, మొయిన్, బాబు, సురేష్, నసీం, నజీమ్, పర్వీన్, నదీమ్ భాయ్, షహీన్ బేగం, గౌసియా తదితరులు పాల్గొన్నారు.





తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక
శుక్రవారం- 13 - ఫిబ్రవరి 2026


# 4 లేబర్ కోడ్ల రద్దు కోరుతూ మల్కాజిగిరిలో సార్వత్రిక సమ్మె ర్యాలీ

**మల్కాజిగిరి, ఫిబ్రవరి 12 (తెలంగాణ ముచ్చట్లు):**

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ 12 ఫిబ్రవరి దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో భాగంగా మల్కాజిగిరిలో సిఐటియు మరియు ప్రజా సంఘాల ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. 4 లేబర్ కోడ్లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ కార్మికులు నినాదాలతో ర్యాలీ చేపట్టారు.ఈ ర్యాలీ ఆనంద్‌బాగ్‌లోని డా.బి.ఆర్.అంబేద్కర్ విగ్రహం వద్ద ప్రారంభమై మల్కాజిగిరి క్రాస్‌రోడ్డు వరకు కొనసాగింది. అనంతరం నిర్వహించిన సభలో ప్రజాసంఘాల నాయకులు కేంద్ర ప్రభుత్వ విధానాలను తీవ్రంగా విమర్శించారు.




సిపిఎం జిల్లా నాయకులు కోమటి రవి మాట్లాడుతూ, స్వాతంత్ర్యానికి ముందు నుంచే కార్మికులు పోరాటాల ద్వారా సాధించుకున్న 29 కార్మిక చట్టాలను 4 లేబర్ కోడ్లుగా మార్చడం ద్వారా కార్మికుల హక్కులను హరించారని ఆరోపించారు. 8 గంటల పనిదినాన్ని 12 గంటలకు పెంచే అవకాశం కల్పించారని విమర్శించారు. గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని బలహీనపరిచారని, విద్యుత్ సవరణ బిల్లు-2025తో విద్యుత్ ఛార్జీలు పెరిగే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పి. నారాయణరెడ్డి మాట్లాడుతూ, ఎన్నికల్లో ఇచ్చిన హామీలను కేంద్ర ప్రభుత్వం నెరవేర్చలేదని విమర్శించారు. నిరుద్యోగులకు ఉద్యోగాల హామీ, నల్లధనం విషయాల్లో చేసిన ప్రకటనలు అమలు కాలేదన్నారు.సమ్మెలో వివిధ కార్మిక, ప్రజా సంఘాల నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. 4 లేబర్ కోడ్లను తక్షణమే రద్దు చేసి కార్మికుల హక్కులను పరిరక్షించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# మున్సిపల్ ఎన్నికలు–2026: ఓట్ల లెక్కింపుకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు

- 500 మీటర్ల పరిధిలో గుమిగూడరాదని కలెక్టర్ హెచ్చరిక

**మేడ్చల్–మల్కాజిగిరి, ఫిబ్రవరి 12 (తెలంగాణ ముచ్చట్లు):**





మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో మున్సిపాలిటీల సాధారణ ఎన్నికలు-2026లో భాగంగా ఓట్ల లెక్కింపుకు సమగ్ర ఏర్పాట్లు చేసినట్లు జిల్లా కలెక్టర్ మను చౌదరి తెలిపారు. మూడుచింతలపల్లి, ఆలియాబాద్, ఎల్లంపేట్ మున్సిపాలిటీల ఓట్ల లెక్కింపును శాంతియుతంగా నిర్వహించేందుకు ప్రత్యేక కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ఆలియాబాద్ మున్సిపాలిటీకి సంబంధించిన లెక్కింపు మజీద్‌పూర్‌లోని టీ చైతన్య హై స్కూల్‌లో, మూడుచింతలపల్లి మున్సిపాలిటీకి జగ్గంగూడలోని తెలంగాణ మైనారిటీ రెసిడెన్షియల్ స్కూల్‌లో, ఎల్లంపేట్ మున్సిపాలిటీకి బైబిల్ కాలేజీలో నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రతి కేంద్రంలో 14 టేబుళ్లతో లెక్కింపు ప్రక్రియ చేపట్టబడుతుంది.ఒక్కో టేబుల్‌కు ఒక సూపర్‌వైజర్, ఇద్దరు అసిస్టెంట్లను నియమించి మొత్తం 153 మంది సిబ్బందితో ఉదయం 8 గంటల నుంచి లెక్కింపు ప్రారంభమవుతుందని తెలిపారు. లెక్కింపు మొత్తం సీసీ కెమెరాల పర్యవేక్షణలో, గట్టి పోలీసు బందోబస్తు మధ్య నిర్వహించబడుతుందని పేర్కొన్నారు.అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు జాగ్రత్తలలో భాగంగా లెక్కింపు కేంద్రాల చుట్టూ 500 మీటర్ల పరిధిలో ఐదుగురికి మించి గుమిగూడరాదని ఆదేశాలు జారీ చేసినట్లు కలెక్టర్ తెలిపారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# దేహదానంతో అమరురాలైన వెంకమ్మ..!

- నేత్రదానంతో ఇద్దరికి చూపు.
- సర్పంచ్ దొడ్డా రాజేంద్ర ప్రసాద్ సహకారంతో

**సత్తుపల్లి, ఫిబ్రవరి 12 (తెలంగాణ ముచ్చట్లు):**




స్థానిక మండలం బేతుపల్లి గ్రామానికి చెందిన నల్లమోతు వెంకమ్మ (82), (భర్త లేటు రాఘవయ్య),బుధవారం సాయంత్రం అనారోగ్యంతో కన్నుమూశారు. వెంకమ్మ పార్థివ దేహానికి బేతుపల్లి సర్పంచ్ దొడ్డా రాజేంద్ర ప్రసాద్ నివాళి అర్పించి, ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకుంటూ, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. అనంతరం ఆమె పార్థివ దేహం వైద్య విద్యార్థులకు విద్యాభ్యాసానికి ఉపయోగపడాలని, కుమార్తెలు బొంతు అనసూర్య (భర్త రామారావు), తన్నీరు పుష్పావతి (భర్త లింగయ్య)లతో మాట్లాడి, మరణానంతరం అగ్గిపాలయ్యే నేత్రాలను దానం చేసి మరో ఇద్దరికి ఉపయోగపడాలని సమాజానికి ఆదర్శంగా నిలవాలని పేర్కొన్నారు. కుటుంబ సభ్యుల సమ్మతితో సత్తుపల్లి లయన్స్ క్లబ్ నేత్రనిధి ఆధ్వర్యంలో వాహనం ఏర్పాటు చేసి, అనంతరం ఆమె పార్థివ దేహాన్ని కిమ్స్ మెడికల్ కళాశాల, నార్కెట్‌పల్లికి తరలించారు. గ్రామస్థులు సర్పంచ్ దొడ్డా రాజేంద్ర ప్రసాద్‌ను అభినందిస్తూ, ఆయన తీసుకున్న నిర్ణయం వైద్య విద్యార్థులకు ఉపయోగపడుతుందని పేర్కొంటూ వెంకమ్మ మృతికి సంతాపం వ్యక్తం చేశారు.

# మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ ప్రథమ కమిషనర్‌కు శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే

**నాచారం, ఫిబ్రవరి 12 (తెలంగాణ ముచ్చట్లు):**

మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ తొలి కమిషనర్‌గా నియమితులైన వినయ్ కృష్ణారెడ్డి ఐఏఎస్‌ను ఉప్పల్ శాసనసభ్యులు బండారి లక్ష్మారెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. నాచారంలోని ఎంఎంసి కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే పూలబొకే అందజేసి అభినందనలు తెలియజేశారు .ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మల్కాజిగిరి నగర అభివృద్ధి, మౌలిక వసతుల బలోపేతం, పారిశుధ్యం, తాగునీటి సరఫరా, రహదారుల మెరుగుదల వంటి అంశాల్లో సమన్వయంతో పనిచేయాలని కోరారు. ప్రజలకు పారదర్శకమైన, సమర్థవంతమైన పౌరసేవలు అందించేందుకు తమ వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో బారాస రాష్ట్ర నాయకులు సాయిజెన్ శేఖర్, బారాస నాయకులు విట్టల్ యాదవ్, చంద్రశేఖర్, గణేష్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.





# గాంధీ ఆసుపత్రిలో సరోజినీ ఫౌండేషన్ అన్నదానం

**ముషీరాబాద్, ఫిబ్రవరి 12 (తెలంగాణ ముచ్చట్లు):**



సరోజినీ ఫౌండేషన్ వ్యవస్థాపకులు, అధ్యక్షులు పి. కాంతారావు ఆధ్వర్యంలో ప్రతినెలా నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమం భాగంగా గాంధీ ఆసుపత్రిలో సేవా కార్యక్రమం నిర్వహించారు .ఈ సందర్భంగా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న పేద రోగులు, వారి సహాయకులు మరియు వృద్ధులకు పండ్లు, తాగునీటి బాటిళ్లు పంపిణీ చేశారు. పి. కాంతారావు స్వయంగా రోగులను పరామర్శిస్తూ వారి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుని, అవసరమైన సహాయం అందిస్తామని తెలిపారు.సమాజంలో ఆర్థికంగా బలహీన వర్గాలకు తోడ్పాటు అందించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఆయన పేర్కొన్నారు. సరోజినీ ఫౌండేషన్ తరపున ఇలాంటి సేవా కార్యక్రమాలు నిరంతరం కొనసాగుతాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు, స్వచ్ఛంద కార్యకర్తలు పాల్గొని సేవా కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఆసుపత్రి సిబ్బంది ఫౌండేషన్ చేపడుతున్న సేవలను అభినందించారు.



# వేలేరు గ్రామాభివృద్ధిపై విస్తృత చర్చలు,గ్రామ సభలో కీలక నిర్ణయాలు

**వేలేరు,ఫిబ్రవరి12(తెలంగాణ ముచ్చట్లు):**

వేలేరు గ్రామ పంచాయితీలో సర్పంచ్ బిల్లా యాదగిరి అధ్యక్షతన గ్రామ సభ నిర్వహించారు. గ్రామాభివృద్ధికి సంబంధించిన పలు అంశాలపై సమావేశంలో విస్తృతంగా చర్చించి కీలక నిర్ణయాలు తీసుకున్నారు. గ్రామ ప్రజల సమస్యలు, అవసరాలు, సూచనలను పరిగణనలోకి తీసుకుని వాటి పరిష్కారానికి చర్యలు చేపట్టాలని నిర్ణయించారు.

ప్రభుత్వ శాఖల వారీగా అధికారులతో సమన్వయం చేస్తూ వివిధ సంక్షేమ, అభివృద్ధి పథకాలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. తాగునీటి సరఫరా, పారిశుద్ధ్యం, రహదారుల మరమ్మతులు, విద్యా సదుపాయాలు, ఆరోగ్య సేవల మెరుగుదల వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించారు. గ్రామంలో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యం ఇవ్వాలని సమావేశంలో సూచించారు.

ఈ సందర్భంగా సర్పంచ్ బిల్లా యాదగిరి మాట్లాడుతూ గ్రామాన్ని అన్ని రంగాల్లో ముందుండేలా తీర్చిదిద్దడం లక్ష్యమని తెలిపారు. ప్రజల భాగస్వామ్యంతోనే అభివృద్ధి సాధ్యమని పేర్కొన్నారు. ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు ప్రతి అర్హుడికి చేరేలా పారదర్శకంగా అమలు చేస్తామని స్పష్టం చేశారు. గ్రామ సభల ద్వారా ప్రజల అభిప్రాయాలను సేకరించి అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేస్తామని వెల్లడించారు.

ఈ సమావేశంలో ఉప సర్పంచ్ శ్రీకర్, జీపీ కార్యదర్శి రవికుమార్, వార్డు సభ్యులు రణధీర్ రెడ్డి, సంధ్య, ఫర్విన్, ప్రవళిక, ప్రశాంత్, జావిద్, లక్ష్మీనారాయణ, చైతన్య, సురేష్, సునీల్ పాల్గొన్నారు. అలాగే ప్రభుత్వ వివిధ శాఖల అధికారులు, గ్రామ ప్రజలు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# సమ్మెతో స్తంభించిన చర్లపల్లి పారిశ్రామికవాడ

- కేంద్ర కార్మిక చట్టాల రద్దుకు కార్మిక సంఘాల డిమాండ్

**చర్లపల్లి, ఫిబ్రవరి 12 (తెలంగాణ ముచ్చట్లు):**

దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో భాగంగా గురువారం చర్లపల్లి పారిశ్రామికవాడలో కార్మికులు భారీ ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపట్టారు. కేంద్ర కార్మిక సంఘాల పిలుపు మేరకు నిర్వహించిన సమ్మెకు విస్తృత స్పందన లభించింది. వివిధ పరిశ్రమలకు చెందిన కార్మికులు, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు, స్కీం వర్కర్లు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. పలుచోట్ల పనులు నిలిచిపోవడంతో పరిశ్రమల కార్యకలాపాలు ప్రభావితమయ్యాయి.ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యుడు, మేడ్చల్ జిల్లా సహాయ కార్యదర్శి జి. శ్రీనివాసులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లు కార్మికుల హక్కులను హరించేవిగా ఉన్నాయని విమర్శించారు.విద్యుత్ (సవరణ) బిల్లు-2025, వి.బి.జి-రామ్ జి చట్టం, నూతన జాతీయ విత్తన చట్టం, ఇన్సూరెన్స్ రంగంలో 100 శాతం ఎఫ్‌డీఐ నిర్ణయాలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటీకరించవద్దని, కనీస వేతనాన్ని రూ.26 వేలుగా నిర్ణయించాలని కోరారు. స్కీం వర్కర్లను కార్మికులుగా గుర్తించి చట్టబద్ధ హక్కులు కల్పించాలని, కాంట్రాక్టు మరియు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని నాయకులు పేర్కొన్నారు. ఎం.వి. యాక్ట్-2019లో ఉన్న ఇబ్బందికర నిబంధనలను సవరించాలని డిమాండ్ చేశారు. 'పోరాడితే పోయేదేమీ లేదు... బానిస సంకెళ్లు తప్ప' అంటూ కార్మికులు నినాదాలు చేస్తూ ర్యాలీలు నిర్వహించారు. సమ్మె శాంతియుతంగా కొనసాగినట్లు నాయకులు తెలిపారు.ఈ కార్యక్రమంలో చర్లపల్లి ఇండస్ట్రియల్ ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షుడు బి.వి. సత్యనారాయణ, సీఐటీయూ జిల్లా నాయకులు ఎం. శ్రీనివాస్ రావు, కొండల్ రెడ్డి, ఏఐటీయూసీ నాయకులు శంకర్ రావు, నర్సింహా, ఐఎఫ్‌టీయూ నాయకులు శివబాబు తదితరులు పాల్గొన్నారు. వివిధ పరిశ్రమల కార్మికులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.



# నాలుగు లేబర్ కోడ్ల రద్దు కోరుతూ కాప్రాలో అవుట్‌సోర్సింగ్ సిబ్బంది సమ్మె

**కాప్రా, ఫిబ్రవరి 12 (తెలంగాణ ముచ్చట్లు):**




కేంద్ర ప్రభుత్వం అమలు చేయాలని యోచిస్తున్న నాలుగు లేబర్ కోడ్లను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ కాప్రా జీహెచ్‌ఎంసీ మున్సిపల్ అవుట్‌సోర్సింగ్ సిబ్బంది ఈసీఐఎల్ చౌరస్తాలో గురువారం సార్వత్రిక సమ్మె చేపట్టారు. పెద్ద ఎత్తున హాజరైన కార్మికులు నినాదాలు చేస్తూ తమ ఆవేదనను వ్యక్తం చేశారు.కార్మికులు మాట్లాడుతూ, నాలుగు లేబర్ కోడ్లు అమల్లోకి వస్తే కార్మికుల హక్కులు క్షీణించే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఉద్యోగ భద్రత, వేతన హామీలపై స్పష్టత లేకపోవడంతో అవుట్‌సోర్సింగ్ సిబ్బంది భవిష్యత్తు అనిశ్చితిలో పడుతుందని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను విరమించి, కార్మికులకు రక్షణ కల్పించే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తమ సేవలను గుర్తించి తగిన వేతనాలు చెల్లించడంతో పాటు, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం హామీ ఇచ్చిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను అర్హులైన మున్సిపల్ కార్మికులకు వెంటనే కేటాయించాలని విజ్ఞప్తి చేశారు.ఈ నిరసన కార్యక్రమంలో సాయిలు, జాన్, చంద్రయ్య, ఏ.జాన్, శివకృష్ణ, మంజుల, కే.లక్ష్మి, అరవింద్, యాదగిరి, అనసూయ, నరసింహులు, ఆంజనేయులు, నర్సింగ్ రావు, నరేష్, జ్యోతి, జమున, వీరేష్, ఎం.సాయి కుమార్, స్వామి, సాయి, సుమన్ తదితరులు పాల్గొన్నారు.సమ్మె శాంతియుతంగా కొనసాగగా, ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోలేదు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# నీట్' రాసే ముస్లింలు ఈడబ్ల్యూఎస్ కోటాలో దరఖాస్తు చేసుకోండి

- మైనార్టీ సంఘం రాష్ట్ర అధ్యక్షులు

ఖమ్మం బ్యూరో, ఫిబ్రవరి 12 (తెలంగాణ ముచ్చట్లు)



నీట్' రాసే ముస్లింలు ఈడబ్ల్యూఎస్ కోటాలో దరఖాస్తు చేసుకోండి.. 'నీట్' 2026 కు హాజరు కానున్న ముస్లిం విద్యార్థులు ఈడబ్ల్యూఎస్ కోటాలో దరఖాస్తు చేసుకోవాలని మైనారిటీ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎండీ.యాకూబ్ పాషా గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈడబ్ల్యూఎస్ సర్టిఫికేట్ పొందినట్లైతే ఎంబీబీఎస్, డెంటల్, ఆయుష్, బీవీఎస్సీ & ఏహెచ్ వంటి పలు కోర్సుల్లో ప్రవేశాలకు 10శాతం సీట్లు పొందే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. నీట్ పరీక్షకు దరఖాస్తు చేసుకునేందుకు మార్చి 8 గడువు తేదీ ఉన్నందున, ముస్లిం విద్యార్థులు తమ ప్రాంతంలో గల మీ సేవ కేంద్రాల్లో ఈడబ్ల్యూఎస్ సర్టిఫికేట్‌లు పొందేందుకు వెంటనే దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఈ ఈడబ్ల్యూఎస్ సర్టిఫికేట్ పొందే క్రమంలో రాష్ట్రంలో గల రెవెన్యూ కార్యాలయాలలో అధికారులు ఏమైనా ఇబ్బందులు పెడితే 8520860785 నంబర్‌కు సంప్రదించాలని కోరారు.



# వేతనాలు ఆలస్యంపై పారిశుద్ధ కార్మికుల ఆవేదన

పెద్దమందడి,ఫిబ్రవరి12(తెలంగాణ ముచ్చట్లు):

పారిశుద్ధ కార్మికులకు గత మూడు నెలలుగా వేతనాలు చెల్లించకపోవడంతో వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు మండల పారిశుద్ధ కార్మికుల అధ్యక్షురాలు గట్టమ్మ ఆవేదన వ్యక్తం చేశారు.గత మూడు నెలలుగా జీతాలు అందక కుటుంబ పోషణ కష్టసాధ్యంగా మారిందని కార్మికులు పేర్కొన్నారు.రోజువారీ ఖర్చులు, పిల్లల విద్య, వైద్య అవసరాలు వంటి అంశాలు నిర్వహించడంలో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు.ఈ సందర్భంగా గట్టమ్మ మాట్లాడుతూ.. పారిశుద్ధ సేవలు నిరంతరం అందిస్తున్న కార్మికుల సమస్యలను గుర్తించి అధికారులు పెండింగ్ వేతనాలను వెంటనే విడుదల చేయాలని కోరారు. సమస్య పరిష్కారంలో ఆలస్యం చేయకుండా చర్యలు తీసుకోవాలని ఆమె విజ్ఞప్తి చేశారు.సంబంధిత అధికారులు స్పందించి కార్మికులకు న్యాయం చేయాలని వారు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

# ఓట్ల లెక్కింపు కేంద్రాల వద్ద ఆంక్షలు

- మద్యం దుకాణాలు బంద్
- పోలీస్ కమిషనర్ సునీల్ దాత్

ఖమ్మం బ్యూరో, ఫిబ్రవరి 12 (తెలంగాణ ముచ్చట్లు)



ఫిబ్రవరి 13 న (శుక్రవారం) మున్సిపాలిటీ ఎన్నికల ఓట్ల లెక్కింపు సందర్భంగా లెక్కింపు కేంద్రాల వద్ద ఆంక్షలు విధిస్తూ పోలీస్ కమిషనర్ సునీల్ దత్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఆంక్షలు 13వ తేదీ ఓట్ల లెక్కింపు పూర్తయ్యే వరకు అమలులో ఉంటాయని పేర్కొన్నారు.

ఓట్ల లెక్కింపు సందర్భంగా శాంతి భద్రతలకు విఘాతం ఏర్పడకుండా ఉండేందుకు ముందుజాగ్రత్త చర్యల్లో భాగంగా కమిషనరేట్ పరిధిలో సెక్షన్ 163 బి న్ ఎస్ ఎస్ విధించినట్లు వెల్లడించారు.

కౌంటింగ్ కేంద్రాల వద్ద నిషేధిత కర్రలు, లాఠీలు, పేలుడు పదార్థాలు, ఆయుధాలతో తిరగడాన్ని నిషేధించారు. మైక్‌లు, మ్యూజిక్ సిస్టమ్, ప్రసంగాలు చేయడం, నిషేధిత ఫోటోలు, సింబల్స్, ప్లకార్డులు ప్రదర్శించకూడదని ఆదేశించారు. ఎలాంటి ర్యాలీలు, ధర్నాలు, బహిరంగ సభలు, సమావేశాలు నిషేధమని, ఐదు లేదా అంతకంటే ఎక్కువ మంది గుమిగూడరాదని పేర్కొన్నారు. రోడ్లు మరియు బహిరంగ ప్రదేశాలలో గెలిచిన అభ్యర్థులు విజయోత్సవ ర్యాలీలు, డీజేలు పెట్టుకోవడం,టపాసులు కాల్చడంపై నిషేధం విధించామని తెలిపారు. ఎవరైనా నిబంధనలు పాటించకుంటే వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

విధి నిర్వహణలో ఉన్న పోలీసు, మిలటరీ, ఎలక్షన్ అధికారులకు ఈ ఆంక్షల నుంచి మినహాయింపు ఉంటుందన్నారు.

అదేవిదంగా ఓట్ల లెక్కింపు సందర్భంగా శుక్రవారం ఉదయం 8:00 గంటల నుండి ఓట్ల లెక్కింపు పూర్తి అయ్యేవరకు ఖమ్మం జిల్లా పరిధిలోని ఏదులాపురం, మధిర, వైరా, సత్తుపల్లి, కల్లూరు మునిసిపాలిటీ కౌంటింగ్ సెంటర్ పరిధిలో వైన్ షాపులు, బార్లు, మద్యం సరఫరా చేసే రెస్టారెంట్లు, మూసివేయాలని ఆదేశించారు. ఎన్నికల నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకుండా పోలింగ్ ప్రశాంతంగా జరిగేలా ముందస్తు చర్యలలో భాగంగా మూసివేయాలని సూచించారు. నిబంధనలు అతిక్రమించి ఎవరైనా మద్యం దుకాణాలు ఓపెన్ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. నిబంధనలు పాటిస్తూ కౌంటింగ్ ప్రశాంతంగా జరిగేలా సహకరించాలని కోరారు.

# సీఐటీయూ ఆధ్వర్యంలో గళమెత్తిన ఉద్యోగులు–కార్మికులు

- వేంసూరు నుంచి మర్లపాడు వరకు భారీ ప్రదర్శన
- నల్ల చట్టాల రద్దే సమ్మె ఉద్దేశ్యం: చలమాల విఠల్ రావు
- ఇది ఆరంభమే..అంతం కాదు: మల్లూరు చంద్రశేఖర్

సత్తుపల్లి, ఫిబ్రవరి 12 (తెలంగాణ ముచ్చట్లు):







ఖమ్మం జిల్లా సత్తుపల్లి నియోజకవర్గ పరిధిలోని వేంసూరు మండలంలో సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్వాడీ, ఆశా ఉద్యోగులు, హమాలీ, బిల్డింగ్, గ్రామపంచాయతీ కార్మికులు గురువారం మోదీ ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై గళమెత్తారు. వేంసూరులోని ఎర్ర రామయ్య భవనం నుంచి మర్లపాడు గ్రామ వ్యాపార కూడలి వరకు మండుటెండను సైతం లెక్కచేయకుండా భారీ ప్రదర్శన నిర్వహించారు. లేబర్ కోడ్లు, విద్యుత్ సంస్కరణలు, విత్తన చట్ట సవరణలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. "మోదీ ప్రభుత్వం డౌన్ డౌన్", "కార్మికుల ఐక్యత వర్ధిల్లాలి", "సీఐటీయూ జిందాబాద్" అంటూ నినాదాలతో ప్రాంతాన్ని మార్మోగించారు. అనంతరం సీఐటీయూ మండల కోకన్వీనర్ వరకా సుశీల అధ్యక్షతన జరిగిన సభలో రాష్ట్ర కమిటీ సభ్యులు చలమాల విఠల్ రావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మిక, కర్షక, కూలీలకు వ్యతిరేకంగా తీసుకొచ్చిన నల్ల చట్టాలను రద్దు చేయాలనే ఉద్దేశంతో అఖిలభారత కార్మిక సంఘాలు, ఉద్యోగ ఫెడరేషన్లు, కర్షక, వ్యవసాయ కార్మిక సంఘాలు దేశవ్యాప్తంగా సమ్మె చేపట్టినట్లు తెలిపారు. కార్పొరేట్లకు అనుకూలంగా పనిచేస్తూ ప్రజల మధ్య మత, కుల వైషమ్యాలు రెచ్చగొడుతూ ప్రజా ఐక్యతకు విఘాతం కలిగిస్తున్నారని విమర్శించారు. జిల్లా సహాయ కార్యదర్శి మల్లూరు చంద్రశేఖర్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా జరిగిన ఈ సమ్మె మోదీ ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ప్రారంభమైన పోరాటాలకు నాంది మాత్రమేనని, ఇది అంతం కాదని స్పష్టం చేశారు. నల్ల చట్టాలు రద్దు చేసే వరకు, అసంఘటిత కార్మికులకు సంక్షేమ చట్టం అమలు చేసే వరకు, అంగన్వాడీ, ఆశా, మధ్యాహ్న భోజన పథకం, ఐకెపి, 104, 108, గ్రామపంచాయతీ తదితర విభాగాల్లో పనిచేస్తున్న ఉద్యోగులు, కార్మికులకు కనీస వేతనాలు, పీఎఫ్, ఈఎస్ఐ, వారసత్వ ఉద్యోగావకాశాలు, పెన్షన్, రిటైర్మెంట్ బెనిఫిట్లు కల్పించే వరకు దశల వారీగా పోరాటాలు కొనసాగుతాయని తెలిపారు. అవసరమైతే దేశవ్యాప్తంగా 60 రోజుల ఏకకాల సమ్మె కూడా నిర్వహించే దిశగా అఖిలభారత నాయకత్వం ఆలోచిస్తోందన్నారు. లేబర్ కోడ్లు రద్దు చేసి పాత కార్మిక చట్టాలను యథాతథంగా అమలు చేస్తేనే శ్రామికవర్గ అభివృద్ధి సాధ్యమై దేశ జీడీపీ పెరుగుదలకు దోహదం అవుతుందని పేర్కొన్నారు. తెలంగాణ రైతు సంఘం మండల కార్యదర్శి అర్వపల్లి గోపాలరావు మాట్లాడుతూ విత్తన సవరణ చట్టం ద్వారా రైతాంగాన్ని దోచుకోవాలని కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆరోపించారు. ప్రజా నాట్యమండలి నాయకులు కండె సత్యం ప్రజావ్యతిరేక విధానాలపై పాట పాడారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు మోరంపూడి వెంకటేశ్వరరావు, అంగన్వాడీ యూనియన్ మండల అధ్యక్షురాలు జీవమ్మ, పుష్ప, శాంతామణి, లక్ష్మి, పద్మజ, పద్మ, రత్నకుమారి, లలిత, కళావతి, ఎలిజబెత్, స్వర్ణ, ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు స్వాతి, అరుణ, పుల్లమ్మ, చిన్నమ్మాయి, రాజేశ్వరి, పద్మ, హమాలీ వర్కర్స్ యూనియన్ నాయకులు అప్పారావు, సత్యం, పూరేటి సుగుణరావు, ఆగర్ల సంఘం నాయకులు తుంగా శేషయ్య, గ్రామపంచాయతీ యూనియన్ నాయకులు సుధాకర్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు. సుమారు 300 మంది హాజరయ్యారు.

# కల్లూరు మున్సిపల్ ఓట్ల లెక్కింపు సందర్భంగా పటిష్టమైన చర్యలు

- కల్లూరు ఏసీపీ వసుంధర యాదవ

ఖమ్మం బ్యూరో, ఫిబ్రవరి 12(తెలంగాణ ముచ్చట్లు)





కల్లూరు మున్సిపల్ ఎన్నికల లెక్కింపు ప్రశాంతంగా పారదర్శకంగా ఉండేలా గట్టి భద్రతా ఏర్పాట్లు చేసినట్లు కల్లూరు ఏసీపీ వసుంధర యాదవ్ అన్నారు. కౌంటింగ్ కేంద్రాలు, స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద 24×7 పోలీసు నిఘాతో మూడు అంచెల భద్రతా వ్యవస్థ అమలులో ఉందన్నారు. కౌంటింగ్ హాళ్లలోకి మొబైల్ ఫోన్లు, పెన్నులు, ఇంక్, ఎలక్ట్రానిక్ పరికరాలు, బ్యాగులు, ఇతర అనధికార వస్తువులు నిషేధించబడ్డాయని, ఐడి కార్డులు కలిగిన ఎన్నికల సిబ్బంది, ఆమోదించబడిన కౌంటింగ్ ఏజెంట్లకు మాత్రమే ప్రవేశం ఉంటుందన్నారు. ట్రాఫిక్ మళ్లింపులు, ప్రత్యేక పార్కింగ్ ఏర్పాట్లు చేయబడ్డాయని తెలిపారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉన్నందున, కౌంటింగ్ కేంద్రాల దగ్గర సమావేశాలు, నినాదాలు, ఆటంకాలకు అనుమతించబడదని అన్నారు. ఉల్లంఘనలపై కఠినమైన చర్యలు తీసుకుంటామన్నారు.

# మున్సిపల్ ఎన్నికల కౌంటింగ్‌కు పటిష్ట ఏర్పాట్లు

- జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి
- కౌంటింగ్ ఏజెంట్లకు ప్రత్యేక ఎంట్రెన్స్, ఎగ్జిట్
- కౌంటింగ్ ఏర్పాట్లపై టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించిన జిల్లా కలెక్టర్

ఖమ్మం బ్యూరో, ఫిబ్రవరి -12(తెలంగాణ ముచ్చట్లు)



నిబంధనల ప్రకారం మునిసిపల్ ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియకు పటిష్ట ఏర్పాట్లు చేసినట్లు జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. జిల్లా కలెక్టర్, మున్సిపల్ ఎన్నికల కౌంటింగ్ పై గురువారం సంబంధిత అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ 5 మున్సిపాలిటీల ఎన్నికల కౌంటింగ్ కు అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. కౌంటింగ్ కేంద్రాలలో మెష్ ఏర్పాట్లతో, కౌంటింగ్ విధుల అధికారులకు, కౌంటింగ్ ఏజెంట్లకు ప్రత్యేక ఎంట్రెన్స్, ఎగ్జిట్ ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. పటిష్ట పోలీస్ బందోబస్తుతో, అన్ని కౌంటింగ్ కేంద్రాలలో 100 శాతం వెబ్ క్యాస్టింగ్ చేస్తున్నట్లు, ప్రతి కౌంటింగ్ కేంద్రంలో రూట్ మ్యాప్ బోర్డులు ఏర్పాట్లు చేసినట్లు అన్నారు.

కౌంటింగ్ హాల్స్ లో కౌంటింగ్ సిబ్బంది, అభ్యర్థులు, కౌంటింగ్ ఏజెంట్లకు మాత్రమే అనుమతి ఉంటుందని, వీరందరికి సంబంధిత పాసులు జారీ చేసినట్లు తెలిపారు.

కౌంటింగ్ కేంద్రాలలో ఉదయం 8 గంటలకు పోస్టల్ బ్యాలెట్ తో కౌంటింగ్ ప్రారంభ మవుతుందని కలెక్టర్ తెలిపారు. కౌంటింగ్ ప్రక్రియలో పూర్తి నిబంధనలు పాటించాలని అన్నారు.

కౌంటింగ్ తర్వాత రిజెక్ట్ ఐనా బ్యాలెట్ పత్రాలతో సహా మొత్తం ఎన్నికల సామాగ్రి సీజ్ చేసి స్ట్రాంగ్ రూమ్ కు తరలించాలని కలెక్టర్ తెలిపారు. ఏదులాపురం లోని 31 వార్డులు, మధిరలోని 22 వార్డులకు, సత్తుపల్లి లోని 23 వార్డులకు, వైరా, కల్లూరు లోని 20 వార్డులకు రెండు రౌండ్ లలో కౌంటింగ్ పూర్తయ్యేలా టేబుల్స్ వేసి కౌంటింగ్ చేయడం జరుగుతుందని కలెక్టర్ అన్నారు.

ఎన్నికల కౌంటింగ్ సంబంధించి బ్యాలెట్ బాక్సులు స్ట్రాంగ్ రూమ్ నుంచి కౌంటింగ్ హాల్స్ తరలించే ప్రక్రియ గురించి ముందుగానే రాజకీయ పార్టీలకు సమాచారం అందించి, మొత్తం ప్రక్రియ వీడియోగ్రఫీ చేయనున్నట్లు కలెక్టర్ తెలిపారు. కౌంటింగ్ విధుల అధికారులు విధుల్లో ఏ దశలోనూ నిర్లక్ష్యానికి తావివ్వవద్దని, అప్రమత్తంగా ఉంటూ, తమ విధులు సమర్థవంతంగా నిర్వర్తించాలని కలెక్టర్ అన్నారు. మునిసిపల్ కమిషనర్లు అప్రమత్తంగా ఉంటూ, ప్రక్రియను పర్యవేక్షణ చేయాలని, అధికారులు, కౌంటింగ్ సిబ్బందిని గైడ్ చేస్తూ, ప్రక్రియ సజావుగా పూర్తి చేయాలని తెలిపారు. ఈ టెలీ కాన్ఫరెన్స్ లో అదనపు కలెక్టర్లుదా. పి. శ్రీజ, పి. శ్రీనివాస రెడ్డి, మునిసిపల్ కమీషనర్లు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# జవహర్‌నగర్‌లో కార్మిక, రైతు వ్యతిరేక విధానాలపై భారీ ప్రదర్శన

- సార్వత్రిక సమ్మె విజయవంతమైందని సంఘాల నేతల ప్రకటన

జవహర్‌నగర్, ఫిబ్రవరి 12 (తెలంగాణ ముచ్చట్లు):



కేంద్ర ప్రభుత్వ కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ జవహర్‌నగర్ జీహెచ్ఎంసి పరిధిలో గురువారం కార్మిక, ప్రజా సంఘాలు భారీ ప్రదర్శన నిర్వహించాయి. అఖిల భారత సార్వత్రిక సమ్మెలో భాగంగా జరిగిన ఈ కార్యక్రమం విజయవంతమైందని సంఘాల నాయకులు వెల్లడించారు.4 లేబర్ కోడ్లు, 3 రైతు వ్యతిరేక చట్టాలు, విత్తన బిల్లు, విద్యుత్ సవరణ బిల్లు-2025 తదితర చట్టాలను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ బాలాజీనగర్‌లోని జీహెచ్ఎంసి కార్యాలయం ప్రధాన రహదారి వద్ద నుంచి ప్రదర్శన ప్రారంభమైంది. కోళ్ళఫారం బస్టాండ్ మీదుగా సాగిన ర్యాలీ డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్, బాబుజగ్జీవన్ రావు విగ్రహాల బస్టాండ్ ప్రాంగణం వరకు కొనసాగింది. ఈ సందర్భంగా కార్మికులు 8 గంటల పనిదినం అమలు చేయాలని, కనీస వేతనాలను ఖచ్చితంగా అమలు చేయాలని, ప్రభుత్వ రంగ సంస్థలను పరిరక్షించాలని నినాదాలు చేశారు. అనంతరం జరిగిన బహిరంగ సభలో ఐఎఫ్‌టీయూ నాయకుడు షేక్ షావలి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలను తీవ్రంగా ఖండించారు. కార్మిక, రైతు వ్యతిరేక విధానాల వల్ల ప్రజలు ఆకలి, దారిద్ర్యం, నిరుద్యోగ సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని సిఐటియు నాయకుడు శివన్నారాయణ పేర్కొన్నారు.తెలంగాణ ఆదర్శ పంచాయతీ మరియు మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నేత శివబాబు మాట్లాడుతూ కార్పొరేట్ సంస్థలకు దేశాన్ని అప్పగించే విధానాలు భవిష్యత్ తరాలకు ప్రమాదకరమని అన్నారు. ఏఐఎఫ్‌టీయూ నాయకులు వై.మల్లేష్, రాము దేశంలో మతతత్వ రాజకీయాలు పెరుగుతున్నాయని విమర్శించారు.పీఓడబ్ల్యూ (విముక్తి) నాయకురాలు పెర్క సునీత రాజ్యాంగ విలువలు దెబ్బతింటున్నాయని ఆరోపించగా, జయసుధ మైనారిటీలపై దాడులు పెరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అసంఘటిత కార్మిక సంఘం నాయకురాలు ఎస్. కే.మీరా ప్రజలు ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం చెన్నాపురం యాదన్న, భూడిద వెంకటేష్, కొయ్యాడ వెంకటేష్, డి.నాగేష్, బాలు, టి.రాణి, ఫాతిమా, బాలమణి, పద్మ తదితరులు పాల్గొన్నారు.



## కరెన్సీ మత్తులో మరిచిపోయిన మనుషులు

సమాజం ఒక పెద్ద మార్కెట్ అయిపోయింది,
ప్రేమకు లేదు ఇక్కడ కొలమానం,
డబ్బుకే ఉంది మనిషి ప్రమాణం.
బంధాలు ప్రేమతో కాదు,
అవసరాలతో కట్టుబడ్డ ఒప్పందాలు.

నవ్వు కూడా ఇప్పుడు లావాదేవీ అయింది,
కరెన్సీ ఉన్నచోట కలిసిన లోకం,
లేనిచోట మిగిలేది ఒంటరితన శోకం.
హృదయం మాత్రమే వింటుంది ఆ మౌన గీతం,
డబ్బు లేనివాడి జీవితనికి అదే సంగీతం.

చేతులు పట్టుకున్న రోజుల్లో మనం మనుషులం,
చెక్కులు మార్చుకున్న రోజుల్లో మనం సంఖ్యలం,
ఈ మార్పుకు పేరు అభివృద్ధి అంటున్నారు.

అమ్మ ప్రేమను కొలవలేము,
కానీ ఆసుపత్రి బిల్లులో మాత్రం దాని విలువ రాస్తున్నారు,
ఇదే కాలం చేసే అతి పెద్ద ద్రోహం.

బంధాలు చెట్ల వేర్లుల్లా ఉండాలి,
కానీ ఇప్పుడు వైఫై సిగ్నల్ లా మారిపోయాయి.
ఉంటే మాట్లాడతాం, లేకపోతే మర్చిపోతాం.

డబ్బు సాధనం కావాలి,
కానీ దేవుడై కూర్చుంటే
మనిషి మోకాళ్ల మీదే మిగిలిపోతాడు.

ఈ సమాజం అద్దం లాంటిది,
మనిషి ముఖం కాదు అతని స్థాయినే చూపిస్తుంది,
అందుకే చాలా మంది ముఖాలు మాస్కులయ్యాయి.

ఒకరోజు
మనిషిని మనిషిగా చూసే కాలం వస్తే,
డబ్బు కాదు బంధాలే అసలు కరెన్సీ అవుతాయి.



రచయిత:
-బసడ
సంపత్ యాదవ్

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
తెలుగు దిన పత్రిక
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్







# రూ.2200 కోట్ల ఆస్తిని కాపాడిన హైడ్రా

- 11 ఎకరాల ప్రభుత్వ భూమి స్వాధీనం
- మొండికుంట చెరువు చుట్టూ ఆక్రమణల తొలగింపు
- వందల షెడ్లు, దుకాణాల తొలగింపు

**హైదరాబాద్, ఫిబ్రవరి 12 (తెలంగాణ ముచ్చట్లు):** మాధాపూర్ హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్ సమీపంలో హైడ్రా గురువారం భారీ ఆపరేషన్ చేపట్టింది. మొండికుంట చెరువుతో పాటు పక్కనే ఉన్న ప్రభుత్వ భూమిపై సాగుతున్న ఆక్రమణలను తొలగించి సుమారు 11 ఎకరాల భూమిని స్వాధీనం చేసుకుంది. ఈ భూమి విలువ దాదాపు రూ.2200 కోట్లుగా అంచనా వేస్తున్నారు.

రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం ఖానామెట్ గ్రామంలోని సర్వే నంబరు 53లోని మొండికుంట, సర్వే నంబరు 55లోని ప్రభుత్వ భూమి ఆక్రమణలకు గురవుతోందని స్థానికులు ఫిర్యాదు చేయడంతో హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ ఆదేశాల మేరకు రెవెన్యూ, జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో ఆలయాన్ని హద్దుగా చూపిస్తూ ఆక్రమణలు చేసినట్లు అధికారులు గుర్తించారు. ఆలయం చుట్టూ మెకానిక్ షెడ్లు, ఇనుము దుకాణాలు, ఇతర తాత్కాలిక నిర్మాణాలు ఏర్పాటు చేసి 30కి పైగా దుకాణాలు నిర్వహిస్తున్నట్లు తేలింది. ఈ షాపుల ద్వారా నెలకు లక్షల్లో అద్దెలు వసూలు చేస్తున్నట్లు సమాచారం. జనవరి 31న నిర్వహించిన విచారణలో రెవెన్యూ అధికారులు ఆక్రమణలు జరిగాయని స్పష్టం చేశారు. శాటిలైట్ చిత్రాల ఆధారంగా కూడా అక్రమ నిర్మాణాలు ఉన్నట్లు నిర్ధారించారు. ఆక్రమణదారులకు ముందుగా సమాచారం ఇచ్చి గడువు ఇచ్చిన అనంతరం గురువారం భారీ బందోబస్తు మధ్య వందల తాత్కాలిక షెడ్లు తొలగించారు.

మొండికుంట చెరువును కాపాడినందుకు స్థానికులు హైడ్రా చర్యలను అభినందించారు. స్వాధీనం చేసిన భూమిలో పార్కులు అభివృద్ధి చేయాలని, చెరువును సుందరీకరించాలని హైడ్రా అధికారులను కోరారు.



# ఎన్నికల కౌంటింగ్ కేంద్రం పరిశీలన

- ఎస్‌కేఎన్ఆర్ డిగ్రీ కళాశాలలో ఏర్పాట్లు
- భద్రత, పారదర్శకతపై అధికారులకు సూచనలు
- శాంతియుత నిర్వహణకు జిల్లా యంత్రాంగం కట్టుబాటు

**జగిత్యాల, ఫిబ్రవరి 12 (తెలంగాణ ముచ్చట్లు):** రెండవ సాధారణ మున్సిపల్ ఎన్నికలకు సంబంధించి జగిత్యాల జిల్లాలోని ఐదు మున్సిపాలిటీల ఓట్ల లెక్కింపు ప్రక్రియను ఎస్‌కేఎన్ఆర్ డిగ్రీ కళాశాలలో నిర్వహించేందుకు కౌంటింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్, జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ కలిసి పరిశీలించారు.

కౌంటింగ్ ఏర్పాట్లు, భద్రతా చర్యలపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులు సూచించారు. కేంద్రంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల పనితీరును తనిఖీ చేసి, కౌంటింగ్ టేబుళ్ల అమరికపై చర్చించారు. సిబ్బందికి కేటాయించిన బాధ్యతలపై మార్గదర్శకాలు ఇచ్చి, ఎన్నికల నియమావళి కచ్చితంగా అమలు చేయాలని ఆదేశించారు. అభ్యర్థుల ఏజెంట్లకు తగిన సౌకర్యాలు కల్పించాలని సూచించారు. కౌంటింగ్ ప్రక్రియ పారదర్శకంగా జరగాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. స్ట్రాంగ్ రూమ్ భద్రతను స్వయంగా పరిశీలించి, ఈవీఎంల భద్రతా ప్రమాణాలను తనిఖీ చేశారు. మీడియా ప్రతినిధుల కోసం ప్రత్యేక గదిని ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. అత్యవసర సేవలకు ప్రత్యేక ఏర్పాట్లు సిద్ధంగా ఉన్నాయని, కౌంటింగ్ రోజున సిబ్బంది సమయానికి హాజరు కావాలని సూచించారు. ఫలితాల ప్రకటనలో ఎలాంటి ఆలస్యం లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజాస్వామ్య ప్రక్రియను గౌరవించాలని అన్ని రాజకీయ పార్టీలను కోరుతూ, ఎన్నికలు శాంతియుతంగా, నిష్పాక్షికంగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం కట్టుబడి ఉందని తెలిపారు.





# ద్విచక్ర వాహన చోరీల ముఠా అరెస్ట్

- నలుగురు మైనర్లతో పాటు ఏడుగురు అదుపులో
- సుమారు రూ.15 లక్షల విలువైన 15 వాహనాలు స్వాధీనం
- సంగెం–సీసీఎస్ సంయుక్త ఆపరేషన్ విజయం

**వరంగల్, ఫిబ్రవరి 12 (తెలంగాణ ముచ్చట్లు):** వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధితో పాటు హైదరాబాద్ నగరంలో ద్విచక్ర వాహనాల చోరీలకు పాల్పడుతున్న ఏడుగురు సభ్యుల ముఠాను సంగెం పోలీసులు, సీసీఎస్ పోలీసులు సంయుక్తంగా గురువారం అరెస్టు చేశారు. పట్టుబడిన వారిలో నలుగురు మైనర్లు ఉన్నారు. ముఠా వద్ద నుంచి సుమారు రూ.15 లక్షల విలువ గల 15 ద్విచక్ర వాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అరెస్టైన వారిలో మైనర్లతో పాటు దరాంగుల అంజీ (21), ఉర్సు సంతోష్ (27), జైదా రామకృష్ణ (32) ఉన్నట్లు పోలీసులు తెలిపారు. వీరంతా ఒకే ప్రాంతానికి చెందినవారై తరచుగా కలుసుకునే వారు. తక్కువ ఆదాయంతో జీవిస్తూ మద్యం సేవిస్తూ జల్సాలకు అలవాటు పడిన వీరు, డబ్బు అవసరాల కోసం సులభ మార్గంగా వాహన చోరీలను ఎంచుకున్నట్లు ఈస్ట్ జోన్ డీసీపీ అంకిత్ కుమార్ వెల్లడించారు.

నిందితులు పార్కింగ్ చేసిన ద్విచక్ర వాహనాలను తాళాలు పగలగొట్టి చోరీ చేసి, హన్మకొండ పద్మాక్షమ్మ గుట్ట ప్రాంతంలో రహస్యంగా దాచేవారు. సుబేదారి, సంగెం, హసన్‌పర్తి, మిల్స్ కాలనీ, ధర్మసాగర్ పోలీస్ స్టేషన్ల పరిధిలో చోరీలకు పాల్పడటంతో పాటు హైదరాబాద్ మడిపల్లి ప్రాంతంలో కూడా రెండు వాహనాలను అపహరించినట్లు విచారణలో తేలింది. ఈ నెల ఒకటో తేదీన సంగెం మండలంలోని ఆశాలపల్లి గ్రామంలో వాహనం చోరీ కావడంతో కేసు నమోదు చేసిన పోలీసులు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి దర్యాప్తు చేపట్టారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి నిందితులను గుర్తించారు. గవిచర్ల గ్రామం గుండు సమ్మయ్య ఆలయం వద్ద వాహన తనిఖీల సందర్భంగా చోరీ చేసిన వాహనాలతో ప్రయాణిస్తున్న నిందితులను అదుపులోకి తీసుకుని విచారించగా, చోరీలు అంగీకరించారు. నిందితుల సమాచారంతో పద్మాక్షమ్మ గుట్ట వద్ద దాచిన మిగిలిన వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ ఆపరేషన్‌లో ప్రతిభ కనబరిచిన అధికారులను డీసీపీ అభినందించారు. పోలీసుల వేగవంతమైన చర్యలతో ద్విచక్ర వాహన చోరీలకు పాల్పడుతున్న ముఠాకు చెక్ పడింది.

# మహదేవప్ప మృతిపై మంత్రి వాకిటి శ్రీహరి స్పందన

- "నాకు సంబంధం లేదు" అని స్పష్టం
- కాల్‌డేటా పరిశీలించుకోవచ్చని వ్యాఖ్య
- బెదిరింపుల ఆరోపణలపై కలకలం



**హైదరాబాద్, ఫిబ్రవరి 12 (తెలంగాణ ముచ్చట్లు):** మక్తల్ మున్సిపల్ బీజేపీ అభ్యర్థి ఎరుకలి మహదేవప్ప మృతిపై రాష్ట్ర మంత్రి వాకిటి శ్రీహరి స్పందించారు. మహదేవప్ప మృతితో తనకు ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. తాను ఎప్పుడూ మహదేవప్పకు ఫోన్ చేయలేదని, కావాలంటే తన కాల్‌డేటాను పరిశీలించుకోవచ్చని పేర్కొన్నారు. పోస్ట్‌మార్టం నివేదికలో పూర్తి వివరాలు బయటపడతాయని మంత్రి తెలిపారు. నారాయణపేట జిల్లా మక్తల్ మున్సిపాలిటీలో పోలింగ్‌కు కొద్ది గంటల ముందు బీజేపీ వార్డు అభ్యర్థి మహదేవప్ప (45) బలవన్మరణానికి పాల్పడటం తీవ్ర కలకలం రేపింది. ఈ ఘటనతో రాజకీయ వర్గాల్లో ఉద్రిక్తత నెలకొంది. మృతుడి కుటుంబ సభ్యులు మాత్రం మంత్రి వాకిటి శ్రీహరి బెదిరింపుల కారణంగానే మహదేవప్ప ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నారని ఆరోపిస్తున్నారు. 'ప్రచారం నుంచి తప్పుకో, లేకపోతే అంతుచూస్తా' అని బెదిరించారని బంధువులు పేర్కొన్నారు. కొద్ది రోజులుగా కాంగ్రెస్ నాయకులు కూడా ప్రచారం నుంచి తప్పుకోవాలని ఒత్తిడి చేస్తున్నారని ఆరోపించారు. తాను గెలిచినా బతకనివ్వరని చెప్పిన కొన్ని గంటల్లోనే ఈ ఘటన చోటుచేసుకుందని మృతుడి భార్య సత్యమ్మ కన్నీటితో వివరించిన విషయం చర్చనీయాంశమైంది. ఘటనపై పూర్తి వివరాలు పోస్టుమార్టం నివేదిక అనంతరం వెల్లడయ్యే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.

# నాసిరకం భోజనంపై విద్యార్థుల ఆందోళన

- జూకల్ ఎస్టీ ఆశ్రమ పాఠశాలలో నిరసన
- రోడ్డుపై ధర్నా, ట్రాఫిక్ జామ్
- సమస్య పరిష్కారానికి హామీ ఇచ్చిన పోలీసులు

**హైదరాబాద్, ఫిబ్రవరి 12 (తెలంగాణ ముచ్చట్లు):** సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ మండలం జూకల్ శివారులోని ఎస్టీ ఆశ్రమ పాఠశాలలో నాసిరకం భోజనం అందిస్తున్నారని ఆరోపిస్తూ విద్యార్థులు ఆందోళనకు దిగారు. భోజనం నాణ్యతపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసిన విద్యార్థులు రోడ్డుపై ధర్నా నిర్వహించారు.



విద్యార్థులు తమకు ఇచ్చిన అన్నం గిన్నెలను రోడ్డుపై పారేసి, గిరిజన ఆశ్రమ పాఠశాల సిబ్బందికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దీంతో ఆ ప్రాంతంలో కిలోమీటర్ల మేర ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని విద్యార్థులతో మాట్లాడారు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. పోలీసుల చర్చల అనంతరం విద్యార్థులు ధర్నాను విరమించినట్లు సమాచారం. భోజన నాణ్యతపై అధికారులు సమగ్ర విచారణ చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

## క్లిక్ చేసే ముందు ఒక్క క్షణం ఆలోచించండి

# గోప్యతలోని వైరుధ్యం

**ఖమ్మం బ్యూరో, ఫిబ్రవరి 12(తెలంగాణ ముచ్చట్లు)**

మన జీవితాలు కేవలం కెమెరా లెన్స్‌లు మరియు ఫిల్టర్ల మధ్య సాగిపోతున్న ఈ కాలంలో, వ్యక్తిగత పవిత్రతకు మరియు బహిరంగ ప్రదర్శనకు మధ్య ఉన్న సన్నని గీత వేగంగా చెరిగిపోతోంది. మీరు 'షేర్' బటన్ నొక్కే ముందు ఒక్కసారి మిమ్మల్ని మీరు ప్రశ్నించుకోండి: ఈ డిజిటల్ ముద్ర రేపు మీ గౌరవానికి చిహ్నంగా నిలుస్తుందా లేక పశ్చాత్తాపానికి భారంగా మారుతుందా?

**వ్యక్తిగత పరిధి అంతర్ధానం**

మనం మానవ చరిత్రలోనే ఒక వింతైన సంధి కాలంలో ఉన్నాం. కొన్నాళ్ల క్రితం వరకు మన ఇల్లు, మన బంధాలు మరియు మన బలహీనతలు అత్యంత పవిత్రమైన రహస్యాలుగా ఉండేవి—అవి కేవలం మన ఆత్మీయుల మధ్య, ఇంటి నాలుగు గోడల మధ్య మాత్రమే పరిమితం. కానీ నేడు, ఆ వ్యక్తిగత విషయాలన్నీ సామాజిక ఆస్తులుగా మారిపోయాయి. ప్రతి చిన్న సంతోషాన్ని, ప్రతి ఆవేదనను సోషల్ మీడియాలో 'లైకుల' కోసం బలిపీఠంపై పెడుతున్నాం.

మన డిజిటల్ ప్రవర్తనలో ఒక లోతైన వైరుధ్యం ఉంది: పోస్ట్‌ల మీద పోస్ట్‌లు పెడుతూ మన గోప్యతను మనమే తుడిచేస్తున్నాం, కానీ సమాజం మాత్రం మనల్ని గౌరవించాలని, మన లోపాలను కప్పి ఉంచాలని కోరుకుంటున్నాం. మన వ్యక్తిగత జీవితపు తెరలను మనమే స్వయంగా తొలగించుకున్నప్పుడు, ఈ ప్రపంచం మన వైపు తేరిపార చూడటంలో తప్పు పట్టగలమా?

**ఆధునికత వర్సెస్ హుందాతనం**

నేటి ధోరణిలో, నిర్లజ్జను 'స్వేచ్ఛ' అని, ఆడంబరాన్ని 'నిజాయితీ' అని కొత్త పేర్లు పెట్టి పిలుస్తున్నారు. దీనికి విరుద్ధంగా, హుందాతనాన్ని, హయా (బిడియం/సంస్కారం)ను పాటించే వారిని పాతకాలపు మనుషులుగా కొట్టిపారేస్తున్నారు.


కానీ, నిజమైన పురోగతి అంటే హద్దులను చెరిపివేయడం కాదు. మనం ఎంత బహిర్గతం చేశామనేది కాదు, దేన్ని భద్రంగా దాచుకున్నామనేదే మన వ్యక్తిత్వాన్ని నిర్వచిస్తుంది. ఈ సందడితో నిండిన లోకంలో, గుంపుతో వెళ్లకుండా తన విలువల కోసం నిలబడే నిశ్శబ్ద వ్యక్తిత్వానికే అసలైన శక్తి ఉంటుంది.

**మౌనంలోని పవిత్రత**

ప్రతి భావోద్వేగం ప్రదర్శన వస్తువు కాదని మనం గుర్తించాలి. కొన్ని బంధాలు ప్రపంచానికి చాటి చెప్పనప్పుడే అందంగా ఉంటాయి; కొన్ని జ్ఞాపకాలు డిజిటల్ గ్యాలరీలోని పౌరుల కళ్లకు దూరంగా, గుండె లోతుల్లో దాగి ఉన్నప్పుడే వాటికి పవిత్రత చేకూరుతుంది. డిజిటల్ స్క్రీన్ అనేది కేవలం ఒక వేదిక కాదు; అది మన ప్రతిబింబాన్ని చూపే అద్దం. మనం అప్‌లోడ్ చేసే ప్రతి పిక్సెల్ మన అంతర్గత విలువలకు ప్రతీక. తదుపరి క్లిక్ చేసే ముందు, ఆ క్షణికమైన 'లైక్' ఇచ్చే ఆనందాన్ని మరియు జీవితాంతం ఉండే మన డిజిటల్ వారసత్వాన్ని ఒక్కసారి బేరీజు వేసుకోవాలి.

**చివరి మాట**

ఆత్మగౌరవమే అసలైన కవచం. మన ఆత్మగౌరవాన్ని కాపాడే నిశ్శబ్ద రక్షకుడు అది. మన జీవితాన్ని మనం



గౌరవప్రదంగా చూసుకున్నప్పుడు, మన రహస్యాలను పదిలంగా దాచుకున్నప్పుడు.. ఏ 'వైరల్' వీడియో ఇవ్వలేని ఉన్నతమైన గౌరవాన్ని ఈ సమాజం మనకు అందిస్తుంది.

**గుర్తుంచుకోండి:** భవిష్యత్తులోని డిజిటల్ రికార్డుల్లో, మీ వ్యక్తిత్వం మీరు అనుసరించిన ట్రెండ్స్‌ను బట్టి కాదు, మీరు కాపాడుకున్న హుందాతనాన్ని బట్టి కొలవబడుతుంది.

- ముహమ్మద్ ముజాహిద్ — 9640622076

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్: బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# కృష్ణా–వికారాబాద్ రైలు మార్గం కేంద్ర నిధులతోనే చేపట్టాలి: ముఖ్యమంత్రి విజ్ఞప్తి

- రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో భేటీ
- భూ సేకరణ వ్యయం రాష్ట్రం భరిస్తుందని స్పష్టం
- హైస్పీడ్ రైలు కారిడార్లకు శంషాబాద్ సమీపంలో 500 ఎకరాల కేటాయింపు ప్రతిపాదన



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 12 (తెలంగాణ ముచ్చట్లు):** కృష్ణా-వికారాబాద్ రైలు మార్గాన్ని పూర్తిగా కేంద్ర నిధులతో చేపట్టాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్ర రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్‌ను కోరారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన భూ సేకరణ వ్యయాన్ని రాష్ట్ర ప్రభుత్వం భరిస్తుందని ఆయన స్పష్టం చేశారు. పార్లమెంట్‌లోని రైల్వే మంత్రి కార్యాలయంలో జరిగిన భేటీలో ఈ అంశంపై చర్చించారు. టేకల్‌కోడ్ ప్రాంతంలో లైమ్ స్టోన్ నిక్షేపాలు గుర్తించామని, సిమెంట్, జౌళి పరిశ్రమల కేంద్రంగా అభివృద్ధి చేసే ప్రణాళికలు ఉన్నాయని ముఖ్యమంత్రి వివరించారు. కొడంగల్, టేకల్‌కోడ్, దౌల్తాబాద్ ప్రాంతాలను పారిశ్రామిక జోన్లుగా అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. హైదరాబాద్-చెన్నై (778 కి.మీ.), హైదరాబాద్-బెంగళూరు (586 కి.మీ.), హైదరాబాద్-పుణే (556 కి.మీ.) హైస్పీడ్ రైలు కారిడార్లకు శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం సమీపంలో 500 ఎకరాల భూమి కేటాయించేందుకు సిద్ధమని పేర్కొన్నారు. ఈ కారిడార్లు శంషాబాద్ నుంచే ప్రారంభమైతే అది ట్రై జంక్షన్‌గా మారుతుందని తెలిపారు.

హైదరాబాద్-చెన్నై హైస్పీడ్ కారిడార్ అమరావతి మీదుగా వెళ్లేలా చూడాలని, అక్కడి నుంచి బందరు పోర్టుకు రైలు మార్గం మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. దీంతో డ్రైపోర్ట్ నుంచి బందరు పోర్టుకు సరకు రవాణా వేగవంతమవుతుందని చెప్పారు. ఈ మూడు హైస్పీడ్ కారిడార్లకు భూ సేకరణ వెంటనే ప్రారంభించాలని కోరగా, రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ సానుకూలంగా స్పందించి పనులు ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు. సమావేశంలో పలువురు ఎంపీలు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# ముద్దు!! (కిస్ ఆఫ్ లవ్)

ముద్దు ఒక మైకం, ముద్దు ఒక మెడిసిన్
ముద్దు ఒక బావోద్వేగం, ముద్దు ఒక అద్భుతం.
అదేమీ క్రైమ్ కాదు
రహస్యంలా చీకటి గదిలో మాత్రమే వ్యక్తపరచడానికి.
అందమైన ప్రేమకి అదొక మధురమైన కావ్యం
ఆరోగ్యాన్ని, ఆయుస్సుని పెంచే ముద్దుకి
హద్దులు, దాపరికలు అక్కర్లేదు.
గోడలు లేని ఆకాశం కింద
నిర్భయంగా ముద్దాడొచ్చు
ఎందుకంటే
ముద్దు స్వతంత్రమైనది
అవధులు లేని ప్రేమకి నిర్వచనం అది!








# మున్సిపల్ ఓట్ల లెక్కింపుకు పకడ్బందీ ఏర్పాట్లు

- కౌంటింగ్ కేంద్రం తనిఖీ చేసిన కలెక్టర్ అభిలాష అభినవ్
- పారదర్శక నిర్వహణకు అధికారులకు ఆదేశాలు
- భద్రత, సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి

**నిర్మల్, ఫిబ్రవరి 12 (తెలంగాణ ముచ్చట్లు):** ఫిబ్రవరి 13న జరిగే మున్సిపల్ ఎన్నికల ఓట్ల లెక్కింపును పకడ్బందీగా, పారదర్శకంగా నిర్వహించాలని నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులకు ఆదేశించారు. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రాన్ని జిల్లా ఎస్పీ జానకి షర్మిలతో కలిసి తనిఖీ చేశారు. కౌంటింగ్ టేబుళ్లు, గ్యాలరీల అమరికను పరిశీలించి, అవసరమైన సూచనలు ఇచ్చారు.

సిబ్బంది, అభ్యర్థులు, మీడియా ప్రతినిధులకు తగిన సౌకర్యాలు కల్పించాలని సూచించారు. అనుమతి ఉన్నవారినే కేంద్రంలోకి అనుమతించాలని, పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేయాలని అధికారులకు ఆదేశించారు. సరైన పార్కింగ్ సదుపాయాలు కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని చెప్పారు.

అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్ సహా పలువురు అధికారులు ఈ తనిఖీలో పాల్గొన్నారు. ప్రజాస్వామ్య ప్రక్రియను గౌరవిస్తూ ఓట్ల లెక్కింపు పారదర్శకంగా జరగాలని కలెక్టర్ స్పష్టం చేశారు.

# ఫోటోలోని చిన్నారులను గుర్తిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వండి





- అపహరణ ముఠా అరెస్ట్ – ముగ్గురు చిన్నారులు ఇంకా సంరక్షణలో
- రైల్వే స్టేషన్ల పరిసరాల్లో అపహరణలు
- తల్లిదండ్రులు, బంధువులు ముందుకు రావాలని విజ్ఞప్తి

**వరంగల్, ఫిబ్రవరి 12 (తెలంగాణ ముచ్చట్లు):** గత జనవరి నెలలో కాజీపేట పోలీస్ స్టేషన్ పరిధిలో రైల్వే స్టేషన్ పరిసరాల్లో చిన్నారులను అపహరించి విక్రయాలకు పాల్పడుతున్న ముఠాను టాస్క్‌ఫోర్స్, కాజీపేట పోలీసులు సంయుక్తంగా అరెస్టు చేశారు. నిందితుల నుండి అపహరణకు గురైన పలువురు చిన్నారులను రక్షించారు. కొందరు చిన్నారులను వారి తల్లిదండ్రులను గుర్తించి అప్పగించారు. అయితే ఫోటోలో ఉన్న మరో ముగ్గురు చిన్నారులు ప్రస్తుతం శిశు సంక్షేమ శాఖ సంరక్షణలో ఉన్నారు. నిందితుల విచారణలో వెల్లడైన వివరాల ప్రకారం, 6 సంవత్సరాల బాలుడిని 2023 అక్టోబర్‌లో కాజీపేట రైల్వే స్టేషన్ ప్లాట్‌ఫాం నుంచి అపహరించారు. అలాగే 7 నెలల పాపను మంచిర్యాల రైల్వే స్టేషన్ పరిసరాల నుంచి, 5 నెలల పాపను రామగుండం రైల్వే స్టేషన్ సమీపం నుంచి అపహరించినట్లు తేలింది. ఈ ముగ్గురు చిన్నారులను



ఎవరైనా గుర్తించినట్లయితే కాజీపేట పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ సుధాకర్ రెడ్డి (సెల్ నంబర్: 8712685122) ను సంప్రదించాలని పోలీసులు విజ్ఞప్తి చేశారు. తగిన రుజువులు చూపించిన రక్త సంబంధీకులకు చిన్నారులను అప్పగిస్తామని తెలిపారు. చిన్నారుల భద్రత కోసం ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, సమాచారం ఉన్నవారు వెంటనే పోలీసులకు తెలియజేయాలని అధికారులు కోరారు.

# జాగ్రత్తలతో అగ్ని ప్రమాదాలకు చెక్ పెట్టుదాం

- పాతబస్తీలో హైడ్రా అవగాహన కార్యక్రమం
- మార్చి నుంచి తనిఖీలు ముమ్మరం
- నిబంధనలు పాటించకపోతే సీజ్ హెచ్చరిక




**హైదరాబాద్, ఫిబ్రవరి 12 (తెలంగాణ ముచ్చట్లు):** అగ్ని ప్రమాదాల నివారణపై హైడ్రా పాతబస్తీలో గురువారం విస్తృత అవగాహన కార్యక్రమం నిర్వహించింది. స్థానిక ఎమ్మెల్యే జుల్ఫికర్‌తో కలిసి హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ పాల్గొని మాట్లాడారు. వేసవి కాలం సమీపిస్తున్న నేపథ్యంలో అగ్ని మాపక నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. "నిప్పుతో ఊహించని ముప్పు ఉంటుంది. కేవలం 30 సెకన్లలోనే మంటలు వ్యాపించే పరిస్థితి ఉంది. నగరంలో జరిగిన అనేక అగ్ని ప్రమాదాల పరిశీలనలో నిబంధనలు పాటించకపోవడమే ప్రధాన కారణంగా కనిపిస్తోంది. అందుకే హైడ్రా ఈ అంశంపై ప్రత్యేక దృష్టి పెట్టింది" అని కమిషనర్ తెలిపారు. జనవరి నెలాఖరులో నిర్వహించిన తనిఖీల్లో 9 దుకాణాలను సీజ్ చేసినట్లు గుర్తు చేశారు. వ్యాపార సంఘాల వినతిపై ఒక నెల గడువు ఇచ్చామని, మార్చి రెండో వారం నుంచి తనిఖీలు ముమ్మరం చేస్తామని స్పష్టం చేశారు. నిబంధనలు పాటించని వ్యాపార సముదాయాలు, దుకాణాలను సీజ్ చేయడంలో వెనుకాడబోమని హెచ్చరించారు.

తనిఖీలను వేధింపులుగా భావించవద్దని, ప్రజల భద్రత కోసమే ఈ చర్యలు చేపడుతున్నామని కమిషనర్ అన్నారు. వ్యాపారులు తమ భద్రతతో పాటు వినియోగదారుల భద్రత గురించి కూడా ఆలోచించాలని సూచించారు. ఎవరైనా నిబంధనలు ఉల్లంఘిస్తే సమాచారం ఇవ్వాలని పౌరులను కోరారు. కార్యక్రమంలో గత అగ్ని ప్రమాదాల దృశ్యాలు, రక్షణ చర్యల వివరాలను ప్రదర్శించారు. చార్మినార్ ఎమ్మెల్యే జుల్ఫికర్ మాట్లాడుతూ ప్రమాదాలు జరగక ముందే అప్రమత్తమవ్వాలని సూచించారు. ముఖ్యంగా రంజాన్ మాసంలో వ్యాపారాలు ఎక్కువగా జరిగే సమయంలో స్టాక్ నిల్వలపై జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు.

ఈ కార్యక్రమంలో హైడ్రా అదనపు డైరెక్టర్ వర్ల పాపయ్య, ఆర్ఎఫ్వో జయప్రకాష్, డీఎఫ్వోలు యజ్ఞనారాయణ, వెంకన్న, విద్యుత్ శాఖ అధికారి ఏవీ రామారావు, నగర ప్రణాళికాధికారి శ్రీనివాస్ రెడ్డి తదితర అధికారులు పాల్గొన్నారు. అగ్ని ప్రమాదాల నివారణకు సమష్టి బాధ్యత అవసరమని, ప్రజల సహకారంతోనే భద్రత సాధ్యమని హైడ్రా అధికారులు స్పష్టం చేశారు.

# విజయోత్సవ ర్యాలీలకు అనుమతి లేదు: జిల్లా ఎస్పీ నితిక పంత్

- మున్సిపల్ ఫలితాల తర్వాత కట్టుదిట్టమైన ఆంక్షలు
- అభ్యర్థులు ఎన్నికల నియమావళిని పాటించాలని సూచన
- ఉల్లంఘనలపై చట్టపరమైన చర్యల హెచ్చరిక

**అసిఫాబాద్, ఫిబ్రవరి 12 (డిజైనర్ టెక్ గురు ప్రతినిధి):** మున్సిపల్ ఎన్నికల ఫలితాల అనంతరం ఎలాంటి విజయోత్సవ ర్యాలీలు, ఊరేగింపులు, టపాకాయలు కాల్చడం వంటి కార్యక్రమాలకు అనుమతి లేదని జిల్లా ఎస్పీ నితిక పంత్ స్పష్టం చేశారు. గెలిచిన అభ్యర్థులు ఎన్నికల ప్రవర్తనా నియమావళి కచ్చితంగా పాటించాలని సూచించారు. ప్రజా శాంతి భద్రతలకు భంగం కలిగించే చర్యలకు పాల్పడరాదని హెచ్చరించారు. నిబంధనలకు విరుద్ధంగా ప్రవర్తించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్పీ పేర్కొన్నారు. ఎన్నికల ఫలితాల తర్వాత కూడా జిల్లాలో శాంతి భద్రతలు కాపాడటానికి పోలీసు శాఖ అప్రమత్తంగా ఉన్నట్లు తెలిపారు.



Printed,Published and Owned by RAJESH BOLLEPAKA,Printed at Amulya Publications and Printers Graphics,H.No:2-19/1,Thatikayala,Dharmasagar,Hanmakonda,506151 and Published at H.No:2-19/1,Thatikayala,Dharmasagar, Hanmakonda,506151.Editor:BOLLEPAKA RAJESH.RNI:TELTEL/2023/88710.Contact:9493669669.Email:telanganamuchatlu.in@gmail.com.Website:www.telanganamuchatlu.in